నిజాల నిగ్గు తేల్చే
# చర్చ
తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

నిజాల నిగ్గు తేల్చే చర్చ తెలుగు దిన పత్రిక

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 24 సంచిక : 21
బుధవారం, అక్టోబర్ 15, 2025 , పేజీలు - 12 వెల: 2/-


# బానకచర్ల విషయంలో ఏపీని నిలువరించండి

**బానకచర్లపై పోలవరం - బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో లేఖ రాసిన తెలంగాణ**

**బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో వెల్లడి**

**టెండర్, భూసేకరణ విషయంలో ముందుకు వెళ్లకుండా చూడాలని విజ్ఞప్తి**

**న్యూఢిల్లీ,అక్టోబర్14:**
పోలవరం – బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు జల శక్తి కార్యదర్శికి రాష్ట్ర నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. మిగతా 2లో...





పాస్‌వర్డ్ మర్చిపోయాను

## అంటే కుదరదు..

**తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు: ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే.. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ఆదేశం**

**సిట్ పిలిచినప్పుడు ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్ రీసెట్ చేయాలని సూచన**

**ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించడం లేదని కోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం**

**తదుపరి విచారణ వరకు ప్రభాకర్ రావు అరెస్ట్ నుంచి మధ్యంతర రక్షణ కొనసాగింపు**

2లో.



## ఇది దళితుల సమస్య..

**ఐపీఎస్ పూరన్ కుమార్ మృతిపై రాహుల్ సంచలన వ్యాఖ్యలు**

**ఆత్మహత్య చేసుకున్న ఐపీఎస్ పూరన్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన రాహుల్ గాంధీ**

**ప్రణాళికాబద్ధంగా ఆయన కెరీర్‌ను దెబ్బతీశారని విమర్శ**

**ఇది కుటుంబ సమస్య కాదు, దళితుల సమస్య అని వ్యాఖ్య**

**ప్రధాని మోదీ, సీఎం సైనీ వెంటనే స్పందించాలని డిమాండ్**

2లో.


# విశాఖకు గూగుల్ డేటా సెంటర్




**సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి**

**ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు**

**న్యూఢిల్లీ,అక్టోబర్14:** ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని అభివృద్ధి చేశామని.. ప్రస్తుతం విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై దిల్లీలో ఆ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం సందర్భంగా 'భారత్ ఏఐ శక్తి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చాం. ప్రస్తుతం విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నాం. సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి. డిజిటల్ కనెక్టివిటీ, డేటా సెంటర్, ఏఐ, రియల్‌టైమ్ డేటా కలెక్షన్లు ముఖ్యమైనవి. మిగతా 2లో...




## సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు

**హైకోర్టు తీర్పు తమకు నిరాశ కలిగించింది**

**ఎస్ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్**

**మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి**



**న్యూఢిల్లీ,అక్టోబర్14:** పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలు మద్దతిచ్చాయని, ఇప్పుడు మాట మారుస్తున్నాయని అన్నారు. మిగతా 2లో...

## ప్రధాని మోదీ హయాంలో జీరో టెర్రరిజం పాలసీ



**భారత్ ను కాపాడే బలమైన కవచం ఎన్‌ఎస్‌జీ హబ్ : అమిత్ షా**

**హర్యానాలోని మానేసర్‌లో ఎన్‌ఎస్‌జీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**

**కమాండోల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రానికి శంకుస్థాపన**

**న్యూఢిల్లీ,అక్టోబర్14** ఉగ్రవాదం, వ్యవస్థీకృత నేరాలకు వ్యతిరేకంగా నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ) దేశానికి ఒక బలమైన రక్షణ కవచంలా పనిచేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించారు. హర్యానాలోని మానేసర్‌లో మంగళవారం జరిగిన ఎన్‌ఎస్‌జీ 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించిన భద్రతా సిబ్బందికి ఆయన నివాళులర్పించారు. మిగతా 2లో...

## అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

**మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..**

**పోలీసులకు లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు వేణుగోపాల్ రావు**

**ఆయనతో పాటు మరో 60 మంది కూడా లొంగుబాటు**

**మహారాష్ట్రలోని గడ్చిరోలిలో పోలీసుల ఎదుట హాజరు**

**పార్టీ విధానాలతో విభేదాల వల్లే ఈ నిర్ణయమని సమాచారం**

**దివంగత నేత కిషన్‌జీకి వేణుగోపాల్ స్వయానా సోదరుడు**




2లో

## మాగంటి సునీతకు బిఫామ్ అందించిన కెసిఆర్

**హైదరాబాద్,అక్టోబరు14:** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్ కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరపున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపినాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, మిగతా 2లో...



# ఇది దళితుల సమస్య..

## ఐపీఎస్ పూరన్ కుమార్ మృతిపై రాహుల్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,అక్టోబర్14**ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ మృతి వెనుక ప్రభుత్వ వివక్ష ఉందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానాలో పూరన్ కుమార్ నివాసానికి వెళ్లిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూరన్ కుమార్ మరణం కేవలం ఒక కుటుంబానికి సంబంధించిన విషయం కాదని, ఇది దళితుల సమస్య అని వ్యాఖ్యానించారు.ప్రభుత్వం ఆయనపై ప్రణాళికాబద్ధంగా వివక్ష చూపిందని, ఆయన మనోధైర్యాన్ని దెబ్బతీసి కెరీర్‌ను నాశనం చేసిందని రాహుల్ ఆరోపించారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ తక్షణమే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, నిష్పక్షపాత విచారణ జరిపించడంలో సీఎం సైనీ పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు.చనిపోయిన తర్వాత కూడా తన భర్తకు సరైన గౌరవం దక్కలేదని పూరన్ కుమార్ భార్య తనతో చెప్పినట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన స్పష్టం చేశారు. కాగా, ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఈ నెల 7న తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై రాజకీయంగా దుమారం రేగుతోంది.

# అగ్రనేత మల్లోజుల లొంగుబాటు

## మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ..



**న్యూఢిల్లీ,అక్టోబర్14**మావోయిస్టు పార్టీకి అత్యంత కీలకమైన కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా ఉన్న అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన తన అనుచరులు 60 మందితో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి ఊహించని షాక్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు.గత కొంతకాలంగా పార్టీ అనుసరిస్తున్న విధానాలతో వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతం చేయాలంటే ప్రజల్లోకి బహిరంగంగా వెళ్లడమే సరైన మార్గమని ఆయన భావించినట్లు సమాచారం. ఇదే విషయంపై పార్టీకి ఆయన రాసిన ఓ లేఖ తీవ్ర కలకలం రేపింది. కొన్ని రోజుల క్రితం, దివంగత మావోయిస్టు నేత, తన సోదరుడైన మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్‌జీ) పేరుతో రాసిన మరో లేఖలో కూడా ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలోనే తాను పార్టీ నుంచి శాశ్వతంగా వైదొలగుతున్నట్లు వేణుగోపాల్ ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీలో ఇకపై కొనసాగలేనని స్పష్టం చేస్తూ ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. ఈ ప్రకటన చేసిన కొన్ని రోజులకే, తన అనుచరులతో కలిసి గడ్చిరోలి పోలీసుల ఎదుట ఆయన లొంగిపోవడం గమనార్హం. ఆయన లొంగుబాటుకు దారితీసిన కచ్చితమైన కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

# మాగంటి సునీతకు బిఫామ్ అందించిన కెసిఆర్

(మొదటి పేజి తరువాయి)



అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరలు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది.

# బానకచర్ల విషయంలో ఏపీని నిలువరించండి

(మొదటి పేజి తరువాయి)

. బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు ఆ లేఖలో ఆయన గుర్తు చేశారు.డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా, నిబంధనలు మరియు విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు.ఈ విషయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే కేంద్ర జల సంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. పోలవరం – బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు వెళ్లకుండా నిలువరించాలని, టెండర్ ప్రక్రియ మరియు భూసేకరణ విషయంలో ముందుకు వెళ్లకుండా చూడాలని కోరారు.

# పాస్‌వర్డ్ మర్చిపోయాను అంటే కుదరదు

## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు: ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే..

## ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ,అక్టోబర్14** తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన తన ఐక్లౌడ్ సహా ఇతర క్లౌడ్ ఖాతాల ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) తప్పనిసరిగా అందించాలని మంగళవారం స్పష్టం చేసింది. ఈ కేసులో ఆయన అరెస్ట్‌పై మధ్యంతర రక్షణను పొడిగిస్తూనే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది.తాను తన ఐక్లౌడ్ ఖాతా పాస్‌వర్డ్‌ను మర్చిపోయానని, అది చాలా పాతదని ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం, సిట్ ఎప్పుడు పిలిచినా ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసి, యాక్టివేట్ చేయాలని ఆదేశించింది. విచారణ బృందానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేసింది.విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించకపోవడం వల్ల కేసులో పురోగతి లేదని తెలిపారు. ఆయన తన డివైజ్‌లను ఫార్మాట్ చేసి కీలకమైన ఎలక్ట్రానిక్ ఆధారాలను నాశనం చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ ఆరోపణలను ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది డి.ఎస్. నాయుడు ఖండించారు. తన క్లయింట్ వ్యక్తిగత ఐక్లౌడ్ పాస్‌వర్డ్ మినహా అడిగిన అన్ని వివరాలనూ సిట్‌కు ఇచ్చారని, ఇప్పటికే 11 సార్లు విచారణకు హాజరై 18 గంటల పాటు ప్రశ్నలకు సమాధానమిచ్చారని తెలిపారు.

# విశాఖకు గూగుల్ డేటా సెంటర్

(మొదటి పేజి తరువాయి)

సాంకేతికను అందిపుచ్చుకోవడంలో ఏపీ ముందుంటుంది. 2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యం. హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ నినాదం తీసుకొచ్చాం. ఐదేళ్లలో గూగుల్ 15 బిలియన్ డాలర్లు ఖర్చు పెడతామనడం సంతోషదాయకం.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో ప్రధాని మోదీ కీలకంగా వ్యవహరించారు. ప్రధానితో పాటు కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో లోకేశ్ ప్రధాన పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణం, ఐటీ రంగాన్ని ప్రోత్సహించా. ఐటీతో చాలా కాలంగా అనుసంధానమై ఉన్నా. రియల్‌టైమ్ డేటా, హిస్టారికల్ డేటా సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్ ప్రత్యేకం. వన్ ఫ్యామిలీ–వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తాం. ప్రతి కుటుంబానికి ఏఐని దగ్గరచేసేలా ప్రయత్నిస్తాం అని చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ మద్దతుతో ఇది సాధ్యం అయ్యిందన్నారు. తాను చూసిన ప్రధాన మంత్రులలో మోదీ ప్రత్యేకమన్నారు. విజినరీ, ఆలోచన తీరు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ఎవరూ అందుకోలేరని కొనియాడారు. ప్రధాని సారథ్యంలో 2047 కంటే ముందుగానే భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ , కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారం అందించారన్నారు. విశాఖపట్నానికి గూగుల్ రావడంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. గూగుల్ డాటా సెంటర్‌కు అన్ని విధాల ఏపీ ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అనేక మార్పులు వస్తాయని... పలు కంపెనీలు గూగుల్ బాటలో పయనించే అవకాశం ఉందన్నారు. నైతిక విలువలతో కూడిన ఏఐ టెక్నాలజీ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలు అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందంజలో ఉందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దూరదృష్టితో అనేక సంస్కరణలు వచ్చాయని చెప్పారు. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందుందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను 2047నాటికి సగర్వంగా నిలబెట్టాలన్న కల సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత ప్రపంచాన్నే మార్చేస్తోందని మరో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. నైపుణ్యం ఉన్న యువతకు మరిన్ని అవకాశాలు రాబోతున్నాయన్నారు.



# వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం

## సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు





విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది. దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమీకి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచు కునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఇదొక చిరస్మరణీయమైన రోజు. విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, ఏఐ విప్లవంలో భాగం కావడం గర్వంగా ఉంది. ఈ పెట్టుబడులు హెల్త్‌కేర్, వ్యవసాయం, లాజిస్టిక్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో వేగవంతమైన ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం తగిన వ్యవస్థను సృష్టిస్తుంది. సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో తగిన తోడ్పాటు లభిస్తుందని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. దిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతిపెద్ద పెట్టుబడి కావడం విశేషం.

# సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు.......

(మొదటి పేజి తరువాయి)

. ఇదిలావుంటే బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై ఈ నెల 9వ తేదీన హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో ఈ ఎస్ఎల్‌పీ పిటిషన్ వేసింది. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి విధిస్తున్నట్లు రాజ్యాంగంలో ఎక్కడా నిబంధనలు లేవని ఎస్ఎల్‌పీలో తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. సుప్రీంకోర్టు మాత్రమే దాన్నో మార్గదర్శక సూత్రంగా నిర్దేశించిందనీ పిటిషన్ లో పేర్కొంది. ప్రత్యేక సందర్భాల్లో రిజర్వేషన్లు కల్పించవచ్చని ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసిం ది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ఎంతమేరకు రిజర్వేషన్లు కల్పించాలన్న అంశంపై సమగ్ర, శాస్త్రీయ అధ్యయనం తెలంగాణలో జరిగిందని.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే 2024–25లో రాష్ట్ర జనాభాలో 56.33శాతం మంది బీసీలు ఉన్నారని తెలిపింది. రాహుల్ రమేశ్ వాఘ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో సుప్రీంకోర్టు సమర్థించిందని పేర్కొంది. తమిళనాడు గవర్నర్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రస్తావించింది. ప్రభుత్వం శాసనసభలో ఆమోదించి పంపిన బిల్లులకు మూడు నెలల్లోపు గవర్నర్ ,రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే వాటికి ఆమోదముద్ర వేసినట్లుగానే భావించాల్సి ఉంటుందని.. ఈ విషయాలను పరిగణలోకి తీసుకోవాలంటూ పిటిషన్ లో పేర్కొంది. న్యాయం తమవైపు ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. సుప్రీంలో తప్పకుండా అనుకూల తీర్పు వస్తుందని అన్నారు.

# పథాని మోదీ హయాంలో జీరో టెర్రరిజం పాలసీ

(మొదటి పేజి తరువాయి)

ఈ కార్యక్రమంలో అమిత్ షా కీలక ప్రకటన చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ఎన్ఎస్‌జీ కొత్త హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, జమ్మూలలో హబ్‌లు ఉండగా, అయోధ్యతో వాటి సంఖ్య ఏడుకు చేరుకుంటుందని వివరించారు. దీనివల్ల ఉగ్రవాద ముప్పును వేగంగా ఎదుర్కొనే సామర్థ్యం పెరుగుతుందని ఆయన అన్నారు.అక్షరధామ్ ఆలయంపై దాడి, 26/11 ముంబై దాడులు, పలు బందీల విముక్తి ఆపరేషన్ల వంటి క్లిష్టమైన సమయాల్లో ఎన్ఎస్‌జీ చూపిన ధైర్యసాహసాలను ఆయన గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం 'జీరో టెర్రరిజం' విధానాన్ని అనుసరిస్తోందని అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు 2019 నుంచి యూఏపీఏ, ఎన్ఐఏ చట్టాలకు సవరణలు, టెర్రర్ ఫండింగ్‌ను అరికట్టేందుకు ఈడీ, పీఎంఎల్ఏకు అధికారాలు, పీఎఫ్ఐపై నిషేధం వంటి అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు.సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్, ఆర్టికల్ 370 రద్దు వంటి చర్యలతో ఉగ్రవాదుల వెన్ను విరిచామని ఆయన పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్', 'ఆపరేషన్ మహాదేవ్' వంటి ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా తప్పించుకోలేరని హెచ్చరించారు. ఈ పర్యటనలో భాగంగా, రూ.




141 కోట్ల వ్యయంతో 8 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ప్రత్యేక శిక్షణా కేంద్రానికి అమిత్ షా శంకుస్థాపన చేశారు. ఇది కమాండోలకు అత్యాధునిక శిక్షణ అందించనుందని తెలిపారు. అలాగే, 2019 నుంచి సీఏపీఎఫ్ సిబ్బంది 6.50 కోట్ల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడ్డారని ఆయన కొనియాడారు.

# నల్గొండ ఎన్జి కళాశాలలో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ అభివృద్ధికి హామీ

- నల్గొండ జిల్లాకలెక్టర్ ఇలా త్రిపాఠి





నల్గొండ చర్చ, అక్టోబర్ 14, 2025:రోజు జిల్లా కలెక్టర్ శ్రీమతి ఇలా త్రిపాఠి, ఐఏఎస్, జాయింట్ కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్ లతో కలిసి ఎన్.జీ. కాలేజ్, నల్గొండను సందర్శించారు. ఉదయం వాకింగ్ చేసే వారితో సంభాషించి, వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరంగా విచారించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గారు వాకింగ్ ట్రాక్ మరమ్మతులు మరియు ఓపెన్ జిమ్ అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ శ్రీ ఎం.వి. గోన రెడ్డి గారు, కలెక్టర్ గారికి మరియు అధికారులకు ఫౌండేషన్ తరపున పుస్తకాలు అందజేశారు. అలాగే ఫౌండేషన్ ద్వారా ఎన్.జీ. కాలేజ్ లో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు సిద్ధమని తెలిపారు.శ్రీ గోన రెడ్డి గారు కాలేజ్ అభివృద్ధికి అనుసరిస్తున్న సుస్థిర మరియు భాగస్వామ్య నమూనా గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్, వాకర్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, అలాగే శ్రీ పదురి మోహన్ రెడ్డి వంటి వ్యక్తులు కలిసి మౌలిక వసతుల అభివృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు.ఈ కార్యక్రమానికి శ్రీ వంగల అనిల్ రెడ్డి, శ్రీ బండారు ప్రసాద్, డా. ఏ.చ. పుల్లారావు, శ్రీ జి. లింగయ్య, శ్రీ శౌరయ్య, శ్రీ చింతపల్లి వెంకన్న, రిటైర్డ్ పోలీసు అధికారులు, శ్రీమతి సరళ యాసా, శ్రీ కోమటిరెడ్డి బుచ్చి రెడ్డి దంపతులు, శ్రీ కట్టా అమృత రెడ్డి, శ్రీ భీమార్జున్ రెడ్డి, శ్రీ కొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.తదుపరి శ్రీ గోన రెడ్డి గారు కలెక్టర్ గారిని కోమటిరెడ్డి ప్రతీక్ స్మారక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో వాకింగ్ ట్రాక్ మరియు ల్యాండ్‌స్కేప్ గార్డెన్ అభివృద్ధి చేయాలని కోరారు. దీనివల్ల దేవరకొండ, మిర్యాలగూడ రోడ్ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతమైన వాకింగ్, ఫిట్‌నెస్ సదుపాయాలు లభిస్తాయని చెప్పారు. కలెక్టర్ గారు మరియు అధికారులు ఈ సూచనకు సానుకూలంగా స్పందించి త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చా

## మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురుదెబ్బ అగ్రనేత వేణుగోపాల్ లొంగుబాటు



చర్చ : - కరీంనగర్ :పోలీసులకు లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు వేణుగోపాల్ రావుఆయనతో పాటు మరో 60 మంది కూడా లొంగుబాటుమహారాష్ట్రలోని గడ్చిరోలిలో పోలీసుల ఎదుట హాజరుపార్టీ విధానాలతో విభేదాల వల్లే ఈ నిర్ణయమని సమాచారందివంగత నేత కిషన్‌జీకి వేణుగోపాల్ స్వయానా సోదరుడుమావోయిస్టు పార్టీకి అత్యంత కీలకమైన కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలో సభ్యుడిగా ఉన్న అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన తన అనుచరులు 60 మందితో కలిసి పోలీసుల ఎదుట లొంగిపోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పరిణామం మావోయిస్టు ఉద్యమానికి ఊహించని షాక్‌గా విశ్లేషకులు భావిస్తున్నారు.గత కొంతకాలంగా పార్టీ అనుసరిస్తున్న విధానాలతో వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతం చేయాలంటే ప్రజల్లోకి బహిరంగంగా వెళ్లడమే సరైన మార్గమని ఆయన భావించినట్లు సమాచారం. ఇదే విషయంపై పార్టీకి ఆయన రాసిన ఓ లేఖ తీవ్ర కలకలం రేపింది. కొన్ని రోజుల క్రితం, దివంగత మావోయిస్టు నేత, తన సోదరుడైన మల్లోజుల కోటేశ్వరరావు (కిషన్‌జీ) పేరుతో రాసిన మరో లేఖలో కూడా ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలోనే తాను పార్టీ నుంచి శాశ్వతంగా వైదొలగుతున్నట్లు వేణుగోపాల్ ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీలో ఇకపై కొనసాగలేనని స్పష్టం చేస్తూ ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. ఈ ప్రకటన చేసిన కొన్ని రోజులకే, తన అనుచరులతో కలిసి గడ్చిరోలి పోలీసుల ఎదుట ఆయన లొంగిపోవడం గమనార్హం. ఆయన లొంగుబాటుకు దారితీసిన కచ్చితమైన కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పోరేషన్ పెండింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి




చర్చ :- కరీంనగర్ :కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పోరేషన్ పెండింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి పనులను డిసెంబర్ 31 లోగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీస్కోవాలని నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫూల్ దేశాయ్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం లో మంగళవారం రోజు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ పెండింగ్ ప్రాజెక్టుల అభివృద్ధి పనులు, వీది దీపాల నిర్వాహణా వాటి సమస్యలు, ఫ్లడ్ ప్రపోజల్స్, 15 ఫైనాన్స్ అభివృద్ధి పనులు, నల్ల పన్నుల వసూళ్లు, నూతన అభివృద్ధి పనుల టెండర్ ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. పలు అభివృద్ధి పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకొని సలహాలు సూచనలు చేస్తూ.... ఆదేశాలు జారీ చేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో ప్రారంభించి ప్రస్తుతం పనులు కొనసాగుతున్న డిజిటల్ లైబ్రరీ భవనం, బాలసధన్ భవనం, ఐసీసీసీ భవనం అభివృద్ధి పనులతో పాటు ఎస్ వి పి భవనం అధునీకరణ అభివృద్ధి పనులను వేగవంతం పూర్తి చేయాలని అన్నారు. అక్టోబర్ మాసంలో ఎస్ విపి భవనం అధునీకరణ పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్దం చేసేలా చర్యలు తీస్కోవాలన్నారు. అంతే కాకుండా టవర్ సర్కిల్ రెనవేషన్ అభివృద్ధి పనులను కూడ ప్రారంభం చేసి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని అన్నారు. అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి క్లోజర్ సర్టిఫికేట్ ప్రీపేర్ చేయాలని ఆదేశించారు. మంచి నీటి సరఫరా లో ఇబ్బందులు రాకుండా... నీటి శుద్దీకరణ కేంద్రం లో చేపట్టిన మేజర్ మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 14,34 ఎంఎల్ డి సంపు మీడియా రీప్లేస్ మెంట్ మరమ్మతు పనులతో పాటు 10 ఎంఎల్ డి వాష్ వాటర్ సంపు నిర్మాణం పనులను పూర్తి చేసి... నీరు వృధా కాకుండా అరికట్టాలని అన్నారు. విలీన గ్రామాల డివిజన్ తో సహా నగర వ్యాప్తంగా మంచి నీటి సరఫరా లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమ్మర్ ఆక్షన్ ప్లాన్ చర్యలను ముందస్తుగానే చేపట్టాలని... వీలిన గ్రామాల డివిజన్ లలో ఓపెన్ వెల్స్ వాటర్స్ సోర్స్ ను గుర్తించి... వేసవి కాలం త్రాగు నీటి సరఫరా లో సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరా కు సంబంధించిన ప్రధాన డిస్ట్రిబ్యూషన్ లైన్స్ ప్రపోజల్స్ కు తగిన ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. నల్లా పన్నుల వసూళ్ళ పై స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీది దీపాల నిర్వాహణా సక్రమంగా చేపట్టాలని... నగరంలో లైట్లు వెలగని చోట రీ ప్లేస్ చేసి.... నగర వ్యాప్తంగా వీది దీపాల సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. లైటింగ్ వ్యవస్థలో ఎక్కడ సమస్యలు రాకుండా నగర వ్యాప్తంగా వీది దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ లు సంజీవ్ కుమార్, యాదగిరి, డీఈలు లచ్చిరెడ్డి, ఓం ప్రకాష్, అయూబ్ ఖాన్, దేవేంధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ , ఏఈలు పాల్గొన్నారు.

# "ఆరోగ్య మహిళ" పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి





చర్చ :- కరీంనగర్ :జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో "ఆరోగ్య మహిళ" కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.
నగరంలోని సప్తగిరి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆరోగ్య మహిళ పరీక్షలు చేయించు కుంటున్న మహిళలతో మాట్లాడి ఉచిత పరీక్షల గురించి మరింత మందికి తెలియ జేయా లన్నారు.ఆరోగ్య మహిళ పరీక్షల రికార్డు పరిశీలి ంచారు. రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలను పక్కాగా నమోదు చేసి వారికి ప్రతి నెలా మందులు అందజేయాలనీ అన్నారు. ప్రయివేటు స్టోర్స్ లభించే అన్ని మందులు ప్రభుత్వ ఆసుపత్రి లో ఉచితంగా అందజేస్తారనే విషయం ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో రీస్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. గర్భిణీలకు సిజేరియన్ కాన్పు వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీలకు ప్రోత్సహించాలన్నారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా బరువు తూస్తూ హేమోగ్లోబిన్ పరీక్ష చేయాలన్నారు. హెచ్ బి తక్కువ ఉన్న మహిళలకు ఐరన్ మాత్రలు అందజేయడంతో పాటు పోషకాహారం సూచించాలని తెలిపారు.అనంతరం ఆరోగ్య మహిళ పరీక్షల్లో భాగంగా ఈ ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ వాహనంలో 2డి ఎకో, ఎక్సరే, మమ్మోగ్రఫి పరీక్షల తీరును కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వైద్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐసిసి పరిశీలకుడికి రాజేందర్ రావు ఘన సన్మానం

- డిసీసీ కార్యాలయంలో ప్రెస్ మీట్ కు హాజరు




కరీంనగర్ :కరీంనగర్ డిసిసి, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం కోసం కరీంనగర్ విచ్చేసిన ఏఐసీసీ పరిశీలకుడు శ్రీనివాస్ మానే (హంగల్ ఎమ్మెల్యే కర్ణాటక) ను కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు మంగళవారం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా పిసిసి ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణను మర్యాదపూర్వకంగా పూర్వకంగా కలిశారు. వారిద్దరితో పలు అంశాలపై చర్చించారు. అనంతరం డిసిసి కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్ లో వెలిచాల రాజేందర్ రావు ఏఐసీసీ పరిశీలకులు, కాంగ్రెస్ నేతలతో కలిసి పాల్గొన్నారు.

# 2.50లక్షల అందజేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ చర్చ ప్రతినిధి :నల్గొండ జిల్లా ఎల్లారెడ్డిగూడెం కు చెందిన పోకల శ్రావణ్ కుమార్ వెంకయ్యకు పెద్ద ప్రేగు సంబంధిత శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని సంప్రదించగా..వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 2,50,000/- రూపాయల ను మంజూరు చేయించారు. సంబంధిత ని మంగళవారం సెక్రటేరియట్ లో వారికి మంత్రి అందజేశారు. మంచి వైద్యం అంది,బాధితుడు త్వరగా కోలుకోవాలని కాంక్షించారు."మీకు మరియు మీ కుటుంబానికి ప్రభుత్వము ద్వారా లబ్ధి చేకూర్చినందుకు సంతోషిస్తున్నాను. రాష్ట్రములోని నిరుపేద ప్రజలకి ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. పోకల శ్రవణ్ కుమార్,మీ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో ఎల్లప్పుడూ ఆనందముగా ఉండాలని కోరుకుంటున్నాను" అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆకాంక్షించారు.

## నల్గొండ జిల్లాసదర్ సమ్మేళనానికి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని ఆహ్వానించిన

- అఖిల భారత యాదవ సంఘం




హైదరాబాద్ చర్చ ప్రతినిధి :ఈనెల 25న నల్లగొండ కాలేజ్ గ్రౌండ్ లో జరిగే సదర్ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో మంగళవారం నల్లగొండ జిల్లా అఖిల భారత యాదవ సంఘం నేతలు కలిశారు.సదర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమ పోస్టర్ ను మంత్రి ఆవిష్కరించారు.మంత్రిని ఆహ్వానించిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఏడు కొండలు,
మాజీ కౌన్సిలర్ అల్లి సుభాష్ యాదవ్, మద్ది శ్రీనివాస్ యాదవ్,గంగుల చందు వంశీ యాదవ్,బెల్లి నాగరాజు యాదవ్,చిన బోయిన వెంకన్న యాదవ్,గుండబోయిన వెంకన్న యాదవ్,శివ,వంశీ,లింగయ్య, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహనా వారోత్సవాలు




చర్చ :- కరీంనగర్. రాజన్న సిరిసిల్ల : వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత ఆధ్వర్యంలో అవగాహన వారోత్సవం భాగంగా ఈరోజు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల విజయ రఘునందన్ రావు కళాశాల ప్రిన్సిపాల్ సిరిసిల్ల అధ్యక్షతన కళాశాల విద్యార్థిని విద్యార్థులకు సిపిఆర్ పై డాక్టర్ రామకృష్ణ గారు, డాక్టర్ వేణు మాధవ్ గారు శిక్షణ ఇవ్వడం జరిగింది. సి పి ఆర్ గుండె పోయినప్పుడు లేదా వ్యక్తి యొక్క శ్వాస ఆగిపోయినప్పుడు చేసే అత్యవసర చికిత్స. సి పి ఆర్ చేసే విధానం వ్యక్తి స్థితిని పరిశీలించడం, సహాయం కోరడం, శ్వాసను పరిశీలించడం, శ్వాస అయిపోయినప్పుడు గుండపై నొక్కే విధానం- చాతి మధ్య భాగంలో రెండు చేతులతో బలంగా నొక్కడం నిమిషానికి 120 సార్లు, రెండు అంగుళాల వరకు చాతిని నొక్కడం తరువాత ఉపశ్వాస ప్రతి 30 సెకండ్లకు 2 సార్లు ఇవ్వడం, చాతి పైకి ఎగిరితే సరైన శ్వాస అందుతుందని అనుకోవాలని శిక్షణ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ మరియు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆశ నోడల్ పర్సన్స్, డెమో రాజకుమార్, సిహెచ్ఓ సత్యనారాయణ, శాంత ప్రణయ్, సాగర్ లు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణ నిర్మూలించడం మన అందరి బాధ్యత మొండయ్య ,ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ట్రైనింగ్ కోఆర్డినేటర్ అంబర్ సింగ్.





చర్చ :- కరీంనగర్ :మనుషుల అక్రమ రవాణా నిర్మూలన లో ప్రజలు అందరు భాగస్వామ్యం అయినప్పుడే దీనిని సమూలంగా నివారించవచ్చు అని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ మరియు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి సంస్థ ఆధ్వర్యంలో. వాణినికేతన్ హాల్ నందు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్య. దీనికి పేద మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువ గా గురి అవుతున్నారు. సమాజంలో ప్రజలతో మరియు విద్యార్థులతో సన్నిహితంగా ఉండి గమనించి వారికి అవగాహనా కల్పించాలి, ముఖ్యంగా పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్స్ లో వారికి అవగాహనా కల్పించాలి. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జటిలమైన సమస్య కాబట్టి పిల్లలకు ఫోన్ ఉపయోగించడం ద్వారా వచ్చే నష్టాలను తెలియజేయాలి అని అన్నారు. సమాజంలో ఉన్న చాలా సమస్యలకు ఆర్థిక కారణాలతో పాటు, సామజిక కారణాలు దోహదం చేస్తాయి, మన చుట్టుపక్కల ఉండే ఇలాంటి వాళ్ళను ట్రాఫికెర్స్ టార్గెట్ చేసి, మాయమాటలు, ఉద్యోగం సినిమా అవకాశం అంటూ పట్టణాలకు తీసుకెళ్లి వ్యభిచార గృహాలలో అమ్ముతున్నారు, కాబట్టి మన డిపార్ట్మెంట్ జిల్లా నుండి గ్రామ స్థాయి వరకు అందరు అవగాహనా కలిగి ఉండి, అప్రమతం చేయడం ద్వారా దీన్ని నిర్ములించవచ్చు. చట్టాల పైన అవగాహన పెంచుకోవాలి అని అన్నారు అంబర్ సింగ్: మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించు కోవచ్చు, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీని బారిన పడుతున్నారు. ముఖ్యంగా యువత, పిల్లలు ఆకర్షణకు గురి అయి, పట్టణాలకు వచ్చి వ్యభిచార గృహాలలో అమ్మబడుతున్నారు. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటి వరకు 32 వేల మంది అమ్మాయిలను మహిళలను కాపాడడం జరిగింది. ఇందులో చిన్న పిల్లలు, యువతులు ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా ఈ అక్రమ రవాణా చాలా పెరిగి పోయింది, ముక్యంగా విద్యార్థులు అనవసరం అయినా అప్స్ ద్వారా పర్సనల్ ఫొటోస్ వీడియోస్ పంపడం ద్వారా సెక్స్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారు. మీరు జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు ఉన్న మన సిబ్బంది ఈ విషయాలపై అవగాహనా పొంది ఇతరులకు అవగాహనా కల్పించాలని సూచించారు. ఈ శిక్షణలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం ఎలా జరుగుతుంది, బాధితురాలి పైన ఉండే ప్రభావాలు, సైబర్ అదారిత అక్రమ రవాణా, చట్టాలు %దీచీూ, ఘూూా, ుాజుూా,ుాజపీూా%, సఖి, భరోసా, చైల్డ్ లైన్, పోలీస్ టోల్ ఫ్రీ నంబర్స్ 1098, 100, 181, 1930, 181 ల గురించి చెప్పడం జరిగింది బాలబాలికల పై జరుగుతున్న లైగిక నేరాల గురించి మాట్లాడం జరిగింది పిల్లలతోని మనం ఎలా ఉండాలి మరియు ఎలా రక్షించాలి అనే అంశం పై మాట్లాడం జరిగింది.

## కాంగ్రెస్ ముస్లిం వార్డు కమిటీ ఎంపిక



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం పట్టణం రామవరంలో కాంగ్రెస్ పార్టీ ముస్లిం వార్డు కమిటీను ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణ అధ్యక్షులు ఎండి ఖాజా బక్ష్ ఆధ్వర్యంలో 9వ వార్డు ప్రెసిడెంట్‌గా ఎండి రహీం, వైస్ ప్రెసిడెంట్‌గా పైజుద్దీన్, జనరల్ సెక్రటరీగా ఎస్ కే బాజీ బాబా, సెక్రెటరీగా సంపత్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.కళా వతిల ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఎన్‌డిసి ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ పాల్గొని నూతనంగా ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డు అధ్యక్షులకు కొన్ని సూచనలు చేసి పార్టీ ఆదేశాలతో అందరూ తమ వంతు బాధ్యతగా పనిచేయాలని అందరితో కలిసిమెలిసి ఉండాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎండి కరీం, 10వ వార్డ్ ప్రెసిడెంట్ ఎండి అబ్బాస్, 13వ వార్డు ప్రెసిడెంట్ ఎండి అల్లా బక్ష్, 10వ వార్డ్ జనరల్ సెక్రెటరీ అంజాత్ ఖాన్, కొత్తగూడెం పట్టణ కాంగ్రెస్ మైనార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కైరుల్లా ఖాన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గుడివాడ సీతారామరాజు, పోశం శ్రీను, మల్లారపు కొమరయ్య, రాజ్ కుమార్, మల్లం పురుషోత్తం, రేవంత్, నగేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు స్వర్ణ భారతి విద్యార్థులు



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం పట్టణ పరిధిలోని స్వర్ణ భారతి హై స్కూల్ విద్యార్థులు 11వ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నరసరావుపేట పల్నాడు జిల్లాలో జరిగిన టోర్నమె ంట్‌లో జూనియర్ కేటగిరిలో తెలంగాణ క్రీడాకారులు రెండో స్థానం సాధించారు. ఇండో నేపాల్ టోర్నమెంట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు కొత్తగూడెంకు చెందిన స్వర్ణ భారతి హై స్కూల్ విద్యార్థులు ప్రేమ చంద్, సంకేత్, నిరంజన్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శైలజ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ పాఠశాల నందు నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యతోపాటు,
క్రీడలు నేర్పుతు న్నామని అన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రా హుల్, పిఈటి ఫణి కుమార్, విద్యార్థుల తలి ్లదండ్రులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వానపాముల ఎరువుపై రైతులకు అవగహన



చర్చ :- అశ్వారావుపేట :అశ్వారావుపేట మండల పరిధిలోని నారంవారిగూడెం గ్రామంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉద్యాన కళాశాల విద్యార్థులు మంగళవారం రైతులకు వర్మికంపోస్టింగ్ (వానపాముల ఎరువు తయారీ) పై అవగాహన కల్పించారు. ఉద్యాన కళాశాల మెజర్ల విద్యార్థులు రూరల్ హార్టికల్చర్ వర్క్ ఎక్స్పీరియన్స్ కార్యక్రమం లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులకు వర్మికంపోస్టింగ్ ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు మాట్లాడుతూ ఉద్యాన పంటలలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు మరి యు చెత్తను బయట పారవేయకుండా, వాటిని ఉపయోగించి అధిక నాణ్యత గల వానపాముల ఎరువును (వర్మికంపోస్ట్) తయారు చేసుకునే విధానాన్ని రైతులకు ప్రయోగపూర్వకంగా చూపించారు. దీని వలన పంటలకు రసాయన ఎరువుల వాడకం తగ్గి, భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందని, పండించిన ఉత్పత్తుల నాణ్యత పెరుగుతుందని వివరించారు. ఈ విధంగా సొంతంగా ఎరువులు తయారు చేసుకోవడం వలన రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా తగ్గుతాయని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు కృష్ణ నాయక్, వంశీ, నగేష్, ధర్మతేజ, సురేంద్రలతో పాటు గ్రామ సెక్రటరీ రమేష్ మరియు నారం వారిగూడెం రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సీసీఐ కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలి: సీపీఎం



చర్చ, సత్తుపల్లి:వర్షాలకు దెబ్బతిన్న పత్తి,వరి పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, రాష్ట్రంలో సమగ్ర వ్యవసాయ ప్రణాళిక రూపొందించక పోవడంతో రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చలమాల విఠల్ రావు అన్నారు. పెనుబల్లి మండల పరిధిలోని వి.ఏం.బ ంజర లోగల అమరజీవి చలమాల సూర్యనారాయణ భవన్‌లో మంగళవారం తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు చిట్టిమోదుల కృష్ణ అధ్యక్ష తన ప్రజాసంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విఠల్‌రావు మాటా ్లడుతూ అధిక వర్షాలు,వరదలకు దెబ్బతింటున్న పంటలకు పరిహారం కోసం పంటల బీమా పథకం కూడా అమలు కావటం లేదని, వ్యవసాయ రంగంపై ప్రణాళిక లేకుండా రైతులని రేవంత్ రెడ్డి ఎలా రాజులుగా చేస్తారని ప్రశ్నించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాలను ప్రారంభించి, రైతులను ఆదుకోవాలని, మోడీ ప్రభుత్వం విదేశీ పత్తిపై దిగుమతి సుంకాలను ఎత్తివేయడంతో, విదేశీ పత్తి మోజులో స్వదేశీ వ్యాపారస్తులు పత్తిని కొనుగోలు చేయటం లేదని, తక్షణమే పాలకులు పత్తి కొనుగోలు సిసిఐ ద్వారా ప్రారంభించాలని డిమాండ్ చేవారు. బీసీలకు 42% రిజర్వేషన్లను కేంద్ర బిజెపి ప్రభుత్వం అడ్డుకుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసి అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపిందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి జీవో నెంబర్ 9 ని అమలు చేయించాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల నాయకులు తడికమళ్ళ చిరంజీవి, గుడిమెట్ల బాబు, తడికమళ్ళ చిన్న వెంకన్న, కండే సత్యం, ప్రసాద్, రవీంద్ర, నాగేశ్వరావు, గోపులు తదితరులు పాల్గొన్నారు.

## థింక్-పేర్- షేర్ విధానం పై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

- ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్





చర్చ:- కరీంనగర్. పెద్దపల్లి :థింక్-పేర్- షేర్ విధానం పై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు థింక్-పేర్- షేర్ విధానం పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలో మౌనంగా ఉండేవాళ్ళు, ఇన్ యాక్టివ్ గా ఉండే విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేస్తూ మంచి బోధన అందించేందుకు థింక్ పేర్ షేర్ విధానం అమలకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు.థింక్-పేర్- షేర్ విధానం ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయడానికి ముందు ఉపాధ్యాయులు దీనిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, వారికి ఉన్న ప్రతి అనుమానాలను శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.థింక్-పేర్- షేర్ విధానం వల్ల మౌనంగా ఇన్ ఆక్టివ్ గా ఉండే విద్యార్థులు ఎక్కువ మాట్లాడే వాళ్ళు అందరికీ సమానంగా మాట్లాడే అవకాశం కలిగిస్తుందని అన్నారు. బోధనలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు క్రమంగా మెరుగవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు సురక్షితంగా, విద్యావంతులుగా ఎదగాలి..





చర్చ:- కరీంనగర్. సిరిసిల్ల :బాలికలు సురక్షితంగా, విద్యావంతులుగా మరియు స్వయం సమర్థులుగా ఎదగడానికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్ పర్సన్ జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి.బి. పుష్పలత గారు అన్నారు.. మంగళవారం జిల్లా కేంద్రంలోని కుసుమరామయ్య జడ్పీహెచ్ఎస్ లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్ పర్సన్ జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి.బి. పుష్పలత గారు మాట్లాడుతూ ప్రతి బాలికా గౌరవంగా జీవించే హక్కు కలిగి ఉందని తెలిపారు. చట్టాలపై ప్రతి మహిళ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన మరియు చిత్రలేఖనం పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.
అనంతరం జిల్లా న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ గారు మాట్లాడుతూ ఈ బహుమతులు జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ మరియు తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ యొక్కకింద స్పాన్సర్ చేయబడి తీసుకో బడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఎస్ఐ వినీత రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ మోతిలాల్, శ్రీ.ఎ.వేణు న్యాయవాది, శ్రీ.జి.ఆంజనేయులు న్యాయవాది మరియు శ్రీ.సిహెచ్.భాస్కర్, లోక్ అదాలత్ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం బాధితులకు శాపం

- విద్యుదాఘాతంతో అగాధంలోకి బాధిత కుటుంబాలు
- ప్రమదాలాపై అవగాహన కల్పించడంలో అధికారుల అలసత్వం
- అందని ఆర్థిక సహాయం రోడ్డును పడుతున్న కుటుంబాలు



చర్చ, సత్తుపల్లి:ప్రపంచంలో అన్నింటికన్నా సెకండ్ల వ్యవధిలోనే లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేది, అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్యుత్. అలాంటి విద్యుత్ సరఫరాకు కొందరు అధికారుల నిర్లక్ష్యం ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్లకు, సామాన్య ప్రజలకు శాపంగా మారింది. అదికాస్తా కొందరిని శారీరిక వికలాంగులుగా మారిస్తే... మరికొందరి ప్రాణాలను బలి తీసుకుం టుంది. ఇందుకు సత్తుపల్లి, వేంసూరు మండలాలలో జరిగిన పలు ఘటనలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది మే నెలలో సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామ సమీపం పొలంలో గేదెల మేపేందుకు వెళ్లిన భూక్య బేబీ (36) పొలంలో ్నన్న విద్యుత్ వైర్లను గమనించకపోవడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృత్యువాత పడింది. దీంతో వారి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. అదే నెలలో సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామ శివారులో 45 ఏళ్ల క్రితం నిర్మించిన 33/11 కెవి విద్యుత్తు లైన్ మార్చకపోవటంతో విద్యుత్ తీగ తెగి పొలం పనుల నిమిత్తం బైకుపై వెళు ్తన్న అదే గ్రామానికి చెందిన పైటమర్ల పెద్ద మురళి రెడ్డి (59)పై పడి ద్విచక్రవాహనంతో సహా దగ్ధమయ్యాడు. దీంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆగస్టు నెలలో సత్తుపల్లి మండలం తాళ్లమడ శివారులో ఉన్న రైస్ మిల్లుకు లోడింగ్ నిమిత్తం వచ్చిన ఖమ్మం పట్టణంలో ముస్తఫా నగర్ చెందిన షేక్ అక్తర్ షాషా(49) రైస్ మిల్లు సమీపంలో ఉన్న 33/11 కెవి విద్యుత్తు లైన్ గుర్తించకపోవడంతో విద్యుత్ షాక్ గురై ఖమ్మం, హైదరాబాద్‌లలో పలు ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇటీవల సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ బొత్స కార్తీక్ (19) పాకలగూడెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సరఫరాను పునరుద్ధరించేందుకు వెళ్లి విద్యుత్ షాక్ గురయ్యాడు. ప్రాణా పాయం తప్పినప్పటికీ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం రూ.20 లక్షల వరకు ఖర్చు చేశాడు. ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు. సెప్టెంబర్ నెలలో సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రిషన్ ధర్మసోత్తు రామకృష్ణ పొలంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ మరమ్మత్తులు నిర్వహిస్తుండగా విద్యుత్ షాకు గురై తీవ్ర గాయలపాలవగా, ఈ నెల 10వ తేదీన వేంసూరు మండలం దుద్దుపూడి గ్రామానికి చెందిన జుజ్జు నూరి వెంకటేశ్వరరావు (వెంకట్) విద్యుత్ షాక్ గురై తీవ్ర గాయాలు కావడంతో



సత్తుపల్లి, ఖమ్మం, పరిస్థితి తీవ్రంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు తరలించారు. ఇలాంటి సంఘటనలు సత్తుపల్లి నియోజకవర్గంలోని పలుచోట్ల నిత్యం చోటు చేసుకుంటూనే ఉన్నాయి.

### * విద్యుత్ ప్రమాదాలపై అవగా హన కల్పించడంలో అధికారుల అలసత్వం

సత్తుపల్లి లో వరుస విద్యుత్ ప్రమాదాలపై ఆ శాఖాధికారుల నిర్లక్ష్యంతోపాటు ప్రైవేట్ ఎలక్ట్రిషన్‌లకు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారని తరచూ జరుగుతున్న ప్రమాదాలను భట్టి ఇట్టే అర్థమవుతుంది. ఆ శాఖలో సిబ్బంది కొరతతో ప్రైవేట్ ఎలక్ట్రిషన్‌లను వాడుకుంటున్నారు. కాని వారికి అవసరమైన విద్యుత్ నిరోధక వస్తువులను మాత్రం అధికారులు అందించలేకపోతున్నారు. విద్యుత్ ప్రమాదాలపై ప్రైవేట్ ఎలక్ట్రిషన్‌లకు అవగాహన లేకపోవడంతోనే తరచూ ప్రమాదాలు చోటుచే సుకుంటున్నాయని పలువురు ఆవేదన చెందుతున్నారు. ప్రైవేటు ఎలక్ట్రిషన్‌లకు శిక్షణ, అవగాహన తరగతులను ఏర్పాటు చేసి విద్యుత్తు ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి అవగాహన కల్పించాలని కోరుతున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్య ధోరణి పలు కుటుంబాల్లో విషాదం నింపిందని అనటంలో అతిశయోక్తి లేదు. గతంలో విద్యుత్ శాఖ అధికారులు ప్రతి గ్రామ గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు, రైతులకు విద్యుత్ సరఫరాపై అవగాహన కల్పిస్తుండేవారు. గత పదేళ్లుగా గ్రామాలలో విద్యుత్ ప్రమాదాలపై ఎటువంటి అవగాహన సదస్సులు నిర్వహించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఏడాదిలో ఒకటి రెండుసార్లు విద్యుత్ వాడకంపై అవగాహన సదస్సు అని చెప్పి కేవలం విద్యుత్ శాఖ అధికారులు మాత్రమే పాల్గొని వెళ్లిపోయారని, సామాన్య ప్రజలకు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లను కనీస అవగాహన కల్పించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత శాఖ అధికారులు స్పందించి వరుస ప్రమాదాలపై తగిన దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం జరిగేలాగా ప్రతి గ్రామ గ్రామాన విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సులు నిర్వహించేలాగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### * బాధితులకు అందని ఆర్థిక సహాయం



సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, మండలాల్లో ఇటీవల జరిగిన విద్యుత్ ప్రమాదాలతో అనేక కుటుంబాలు పెద్దదిక్కులు కోల్పోయి రోడ్డును పడ్డాయి. పరిహారం కోసం బాధిత కుటుంబ సభ్యులు ఆఫీసుల చుట్టూ కాళ్లకున్న చెప్పులు అరిగేలా తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని బాధిత కుటుంబ సభ్యులు వాపోతున్నారు. సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన భూక్యా బేబీ (36), ఖమ్మం మున్సిపాలిటీ పరిధిలోని ముస్తఫా నగర్ కు చెందిన షేక్ అక్తర్ పాషా(49) విద్యుత్ షాకు గురై ఖమ్మం, హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్షల రూపాయలు ఖర్చుచేసిన చివరికి ప్రాణాలు కోల్పోయారు. అదేవిధంగా సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన బొత్స కార్తీక్ (19) చిన్నతనంలోనే తండ్రి చనిపోగా, తల్లి రోడ్డు ప్రక్కన చిన్న హెూటల్ నడుపుతుంది. కుటుంబ అవసరాల నిమిత్తం కార్తిక్ విద్యుత్ పనికి వెళ్తుండగా, విద్యుత్ ప్రమాదంలో గాయపడటంతో సుమారు రూ.20 లక్షల మేర దాతల సహాయం ద్వారా వైద్య సేవలు పొందుతున్నాడు. సత్తుపల్లి కొత్తూరు గ్రామంలో పైడమర్ల పెద్ద మురళి రెడ్డి (59) ద్విచకవాహనంతో సహా పూర్తిగా దగ్ధం కాగా వారి కుటుంబానికి ఎటువంటి సహాయం అందకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇప్పటికైనా విద్యుత్ శాఖలో సంబంధిత అధికారులు స్పందించి వారి వారి కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు,.

### * బాధితులకు నష్టపరిహారం అందేలా చూస్తున్నాం: బి.ప్రసాద్ బాబు, ఏడీఈ, సత్తుపల్లి

సత్తుపల్లి, వేంసూరు, మండలాల్లో తరచూ విద్యుత్ ప్రమాదాలపై సత్తుపల్లి ఏడిఈ బి.ప్రసాద్ బాబును 'చర్చ' వివరణ కోరగా, కొత్తూరు గ్రామానికి చెందిన రైతు పెద్ద మురళి రెడ్డి కుటుంబ సభ్యులకు రూ.5. లక్షలు నష్టపరిహారం అందించినట్లు చెప్పారు. మిగతా ఎవరైతే విద్యుత్ ప్రమాదంలో మరణించారు ఉన్నారో వారికి తప్పకుండా రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా తర్వలో అందజేస్తామన్నారు. ప్రైవేట్ ఎలక్ట్రిషన్లకు లైన్మెన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్తు ప్రమాదాలపై వారం వారం పొలంబాట కార్యక్రమం ద్వారా రైతులకు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లకు అవగాహన కల్పిస్తున్నామనాన్రు. ప్రైవేట్ ఎలక్ట్రిషన్‌లు విద్యుత్ ఎర్తు రాడ్లతోపాటు చేతులకు, కాళ్లకు హ్యాండ్ కప్స్ వాడటం, సబ్ స్టేషన్ నుంచి క్లియరెన్స్ తీసుకున్నాక రెండు మూడుసార్లు చెక్ చేసుకుని విద్యుత్ మరమ్మత్తులు ప్రారంభించాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది, ప్రైవేట్ ఎలక్ట్రిషన్ల్, మరమ్మత్తుల సమయంలో రక్షణ సూత్రాలు తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ గ్రామాన సామాన్య ప్రజలకు కూడా విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలందరూ విద్యుత్ వినియోగం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏడీఈ కోరారు.

## ప్రైవేటీకరణ దోపిడికి గురవుతున్న రైతాంగం

- తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు: మాదినేని రమేష్



చర్చ, సత్తుపల్లి:ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలను తెలంగాణ రైతు సంఘం నేతలు సోమవారం తల్లాడ మండల కేంద్రంలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి ఎకరాకు మూడు నుండి నాలుగు క్వింటాలు మాత్రమే పత్తి వస్తుందని, పత్తి ఎకరాకు రూ.60 వేలు పెట్టుబడి పెట్టి పంట చేతికి వచ్చే దశలో అధిక వర్షాల వల్ల పత్తి పూర్తిగా రాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40 నుంచి రూ.50 వేలు నష్టం వాటిలిందని, వరి పంట చేతికి వచ్చే దశలో వైరస్, వాతావరణ పరిస్థితుల వల్ల పంట మొత్తం ఎరుపు రంగు వచ్చి నష్టం జరిగిందని రైతు సంఘం నేతల ఎదుట రైతులు వాపోయారు. అనంతరం రైతుసంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడుతూ నష్టపోయిన పంటలను వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా సర్వే చేయించి రైతులను
ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం రైతులను దోపిడీ చేసే పథకంగా మారిందని విమర్శించారు.ఆదుకోవాల్సిన భీమా పథకం నుండి ప్రభుత్వం వైదొలగి ప్రైవేట్ కార్పోరేట్ కంపెనీలకు అప్పగించడం వల్ల రైతుల నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి నల్లమోతు మోహన్ రావు, సీనియర్ నాయకులు గుంటుపల్లి వెంకటయ్య, అయినాల రామలింగేశ్వర రావు, సత్తెనపల్లి నరేష్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# మోడల్ కాలనీలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ నాగరాజు





చర్చ, అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధి లోని మోడల్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న పలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సిసి రోడ్ల నిర్మాణాలను, నీటి సమస్యతోపాటు పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రాత్రి వేళల్లో వీధుల్లో ప్రజలు తిరగడానికి ఇబ్బందులు పడకుండా అన్ని వీధుల్లో వీధిలైట్లను ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతిరోజు వచ్చే చెత్తబండిలో తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా వెయ్యాలని సూచించారు. ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. మోడల్ కాలనీలో గల పల్లె దవాఖానాతోపాటు అంగన్వాడి స్కూల్‌ను సందర్శించి పలు సూచనలు ఇచ్చారు. ప్రాంగణం పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. అంగన్వాడి స్కూల్లో విద్యార్థులు ఎంతమంది ఉన్నారనే వివరాలు అడిగి, పిల్లలకు పోషక ఆహారంతోపాటు మునగాకు కూరను ముఖ్యంగా పెట్టాలని దానితోపాటు ఆకుకూరలు కచ్చితంగా మెనూలో ఉండాలని సూచించారు. గర్భిణీలకు, చిన్నపిల్లలకు ఆరోగ్య సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిండా హరిబాబు, తగరం ముత్తయ్య, నార్లపాటి కాంతారావు, నార్లపాటి దివాకర్‌లతోపాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి








చర్చ :- కరీంనగర్ :యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎక్సైజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, వైద్య, తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, విద్యాధికారులు కలిసి రోడ్ల పక్కన పాఠశాలలు, పాన్ షాపుల్లో తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలని ఉపాధ్యాయులు , తల్లిదండ్రులకు సూచించారు. అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు.కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్ళు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతోపాటు ఆన్లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్ డిటెక్షన్ కిట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల కేసులను వివరించారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం నశా ముక్త్ భారత్ అభియాన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్ బాబు, డీడబ్ల్యూఓ సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమర్థులకే పార్టీ నాయకత్వ బాధ్యతలు

- ఏఐసీసీ పరిశీలకుడు మానే శ్రీనివాస్









చర్చ :- కరీంనగర్ :సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సమర్థులను జిల్లా,బ్లాక్, మండల పార్టీ అధ్యక్షులుగా ఎంపిక చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ఉద్దేశమని ఏఐసీసీ పరిశీలకుడు మానే శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక కోసం మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని అరుంధతీ ఫంక్షన్ హాల్ లో పార్టీశ్రేణుల అభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో పటిష్టవంతంగా పార్టీ నిర్మాణ బాధ్యతలు జిల్లా అధ్యక్షులకే అధికంగా ఉంటుందని, అందుకే సమర్థత గల నాయకునికే పార్టీ జిల్లా నాయకత్వ బాధ్యతలు అప్పగించాలన్నదే అధిష్టానం ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ పార్టీ నూతనంగా ప్రవేశపెట్టిన నూతన విధానం పార్టీ పటిష్టతకు దోహదపడుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎంపిక మాదిరిగానే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక జరుగుతుందని ఆయన వివరించారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ కష్టకాలంలో కాంగ్రెస్ కోసం కష్టపడ్డవాళ్లకు పార్టీ తప్పకుండా గుర్తించి ఆదరిస్తుందన్నారు. ప్రజాప్రతినిధుల గెలుపు వెనక కార్యకర్తల కష్టం ఉంటుందని, వారు కష్టపడకుంటే నేతలెవరూ అందలమెక్కరన్నారు. వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లకుండా పార్టీ పటిష్టత కోసం అందరం కలిసి కట్టుగా పని చేయాలన్నారు. పార్టీకి నష్టం కలిగించే పనులకు దూరంగా ఉండాలని ఆమె హితవు పలికారు. త్యాగాల కుటుంబం నుంచి నేతగా ఎదిగిన రాహుల్ గాంధీ ఆలోచనా విధానం నుంచే సంఘటన్ సృజన్ అభియాన్ పుట్టుకొచ్చిందన్నారు. ఈ కొత్త విధానం పార్టీశ్రేణులకు మరింత మంచి జరుగుతుందన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అన్నివర్గాల వర్గాల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తున్నదన్నారు. ఘనమైన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవల్సిన బాధ్యతమ మనందరిపై ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పారదర్శకంగా అధ్యక్షుని ఎంపిక జరుగుతుందన్నారు. ఇందులో ఎటువంటి అనుమానాలకు తావులేదన్నారు. పరిశీలకు నిర్మోహమాటంగా తమతమ అభిప్రాయాలు చెప్పుకోవచ్చన్నారు. ఆ సమావేశంలో టీపీసీసీ ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి (మానకొండూర్), గోపగోని బస్వయ్యగౌడ్(శంకరపట్నం), బండారి రమేశ్(తిమ్మాపూర్), ముస్కు ఉపేందర్ రెడ్డి(గన్నేరవరం), ముక్కిస రత్నాకర్ రెడ్డి( బెజ్జంకి), కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి(ఇల్లంతకుంట)తోపాటు పార్టీ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం ఏఐసీసీ పరిశీలకులు అశావహుల నుంచి అభిప్రాయాలు సేకరించారు.

# చారిత్రిక సభకును విజయవంతం చేయండి

- గ్రామ గ్రామాన ప్రచారం, జన సమీకరణ చేయాలి
- బి.సి. రిజర్వేషన్లపై దొంగాట తగదు
- సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని




చర్చ, ఖమ్మం:భారత కమ్యూనిస్టుపార్టీ శత వసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న జరిగే చారిత్రక సభకు పార్టీశ్రేణులను సన్నద్ధం చేయాలని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఖమ్మం బహిరంగసభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచిపోనున్నదని ఆయన తెలిపారు. సి.పి.ఐ జిల్లా కార్యవర్గసమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టుపార్టీకి ఒక ప్రత్యేక స్థానం ఉందని, స్వాతంత్ర ఉద్యమం సందర్భంగా సంపూర్ణ స్వాతంత్ర్యనికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశపు నడిబొడ్డున స్వంతంత్ర రాజుగా ప్రకటించుకున్న నిజాం రాజరికాన్ని కూలదోసి భారతదేశంలో విలీనం చేసేందుకు మహత్తర తెలంగాణ పోరాటాన్ని నిర్వహించింది కూడా కమ్యూనిస్టులేనని గుర్తుచేశారు. ప్రజల హక్కుల కోసం, సంక్షేమం కోసం బహుముఖ పోరాటాలు నిర్వహించి విజయాలను సాధించిందని, భూమి విలువలు గుర్తించి దున్నేవానికి భూమిదక్కాలని చారిత్రక పోరాటాలు చేసినట్లు చెప్పారు. పోరాట చరిత్రను, త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు శత వసంత సంబరాల ముగింపు వేడుకలను ఖమ్మంలో అత్యంత ఘనంగా నిర్వహించాలని సి.పి.ఐ నిర్ణయించిందన్నారు. లక్షలాది మందితో బహిరంగసభ జరుగుతుందని, ఈ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరుకానున్నారని సాంబశివరావు తెలిపారు. బహిరంగసభ, ప్రదర్శనకు సంబంధించి గ్రామగ్రామాన ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. బహిరంగసభను పురస్కరించుకొని సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించడంతోపాటు ప్రత్యేక కళారూపాలను రూపొందించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ వందేళ్ళ చరిత్ర సమకాలీన రాజకీయాలు, ఆర్థిక, సామాజిక పరిస్థితులను వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు.

- బి.సి. రిజర్వేషన్లపై దొంగాట

రాష్ట్రంలో బి.సి. రిజర్వేషన్లపై కొన్ని రాజకీయ పార్టీలు దొంగాట అడుతున్నాయని సాంబశివరావు ఆరోపించారు. మద్దతు ప్రకటిస్తూనే మరోపక్క రిజర్వేషన్లను అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తెలిపారు. బి.సి. రిజర్వేషన్ల అమలుకు సి.పి.ఐ కట్టుబడి ఉన్నదని బి.సి.లకు 42 శాతం అమలుకోసం జరిగే పోరాటాలకు సి.పి.ఐ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. బీజేపీ బి.సి. వ్యతిరేకిగా చరిత్రలో నిలిచి పోతుందన్నారు. 18 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి రావల్సిన ఆర్థిక మొత్తాలను ప్రభుత్వం అందించడం లేదని, తక్షణం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షనర్లు చేపట్టే ఆందోళనకు సి.పి.ఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ మహ్మదౌమౌలాన, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరంవిజయవంతం





చర్చ, సత్తుపల్లి:సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో సత్తుపల్లి లైన్స్ క్లబ్,వైరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిభిరం విజయవంతమైంది.ఈ ఉచిత వైద్య శిభిరంలో సుమారు 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 25మందికి కంటి అపరేషన్స్ గుర్తించారు. ఈ సందర్భంగా క్యాంపు చైర్మన్ పెనుగొండ రమేష్, క్యాంపుకు సహకరించిన జక్కుల ప్రభాకర్ మాట్లాడుతూ వైరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. పేదలకు సేవ చేయటం ద్వారా మానవ జన్మకు సార్ధకత ఉంటుందన్నారు. లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఐ హాస్పిటల్ చైర్మన్, ఐ హాస్పిటల్ నిర్వాహకులు లయన్ శ్యాంబాబు ఉండ్రు, డాక్టర్ రవిచంద్ర, కంటి ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వీస్ కోఆర్డినేటర్ గండ్ర సోమిరెడ్డి, జోన్ చైర్మన్ రమేష్, సత్తుపల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవి, సెక్రెటరీ ఎమ్మెస్ ఎన్వి రమణ, ట్రెజరర్ వెంకటేశ్వరరావు, సత్తుపల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు, మాధురి మధు, కొత్తూరు ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

## ఆరుగురు మావోయిస్టులు లొంగుబాటు

- జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు








చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:మావోయిస్టు పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేస్తున్న ఆరుగురు సభ్యులు లొంగిపోయినట్లు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జిల్లా పోలీసులు, 81, 141 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూత కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని అనేకమంది నక్సలిజాన్ని విడనాడి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతమైన జీవితం గడుపుతున్నారన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 326 మంది నక్సలైట్లు లొంగిపోయినట్లు చెప్పారు. లొంగిపోయిన ఆరుగురు మావోయిస్టు దళ సభ్యులకు తక్షణ సహాయంగా ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.1,50,000/ఇవ్వడం జరిగిందన్నారు. వారి ర్యాంకుల వారిగా మిగతా నగదును, ఆధార్ కార్డులు, బ్యాంక్ అకౌంట్స్ వచ్చిన తర్వాత వారి బ్యాంకు ఖాతాలలో చెక్కుల రూపంలో జమచేస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కొరకు కృషి చేస్తున్నాయని ఎస్పీ వివరించారు. ఆదివాసి ప్రాంతాలలో రోడ్లు, పాఠశాలలు, వైద్యశాలలు, తాగునీరు, విద్యుత్తు సౌకర్యాలు, మారుమూల గిరిజన ప్రాంతానికి నాణ్యమైన విద్యా మరియు వైద్య సౌకర్యాలు కల్పించడానికి పోలీసు శాఖ శ్రమిస్తున్నదన్నారు. కేవలం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుందని, అభివృద్ధితో కూడిన ప్రజల శాంతియుత జీవనం పోలీసుల నినాదం అని ఎస్పీ రోహిత్‌రాజు పేర్కొన్నారు.

## భరోసా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు




చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లా భరోసా కేంద్రం ఆధ్వర్యంలో బూర్గంపాడులోని కేజీబీవీ పాఠశాల, తెలంగాణ గిరిజన సంక్షేమ అప్‌గ్రేడ్ జూనియర్ కాలేజ్ (బాలికలు)లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా బృందం విద్యార్థులకు ఫిల్లిస్ క్రిస్టల్ పద్ధతులు, భరోసా సేవలు, ఫోక్సో చట్టం, సోషల్ మీడియా, మొబైల్ ఫోన్ దుష్ప్రభావాలు, యువతలో ఆకర్షణ వల్ల కలిగే ప్రతికూలతలు, విద్య ప్రాముఖ్యత, టి %-%భద్రత యాప్ వినియోగం వంటి అంశాలపై వివరించారు. విద్యార్థుల్లో భద్రత, జాగ్రత్త, బాధ్యతాపూర్వక ప్రవర్తనపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని భరోసా కేంద్రం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అన్నపురెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్, భరోసా కేంద్రం కౌన్సిలర్ కోఆర్డినేటర్ రేణుక, సపోర్ట్ పర్సన్ రమాదేవి, ఎఎన్‌ఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు నల్లమోతు ప్రోత్సాహం







చర్చ, ఖమ్మం:చింతకాని మండలం నాగులవంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 202425 విద్యా సంవత్సరం 10వ తరగతిలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన మడిపల్లి నివేదిత, కిలారు స్పందనలకు ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.40 వేల నగదు పారితోషికం అందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బయ్యన తులసమ్మ జ్ఞాపకార్థం వారి మనవడు నల్లమోతు కిషోర్ ఈ ఆర్థిక చేయూ తనందించారు. గత కొన్నేళ్లుగా కిషోర్ ఈ సంప్రదాయాన్ని పాటిస్తూ, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. పిల్లల భవితకు అండగా నిలుస్తున్న దాత నల్లమోతు కిషోర్‌తో పాటు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సంస్థకు విద్యార్థుల తల్లితండ్రులు అభినందనలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు కనపర్తి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ప్రతినిధులు బయ్యన బాబురావు, మునుకుంట్ల సుబ్బారావు, గ్రామ పెద్దలు వంకాయలపాటి సత్యనారాయణ, అంబటి వెంకటేశ్వరరావు, ఆలస్యం బసవయ్యలు పాల్గొన్నారు.

## వర్షసూచనను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యం తడవకుండా చూడాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ జిల్లా చర్చ ప్రతినిధి :మంగళవారం ఆమె నల్గొండ జిల్లా ,చిట్యాల మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.అకాల వర్షం వల్ల వర్షానికి తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలని ,ఉదయం ధాన్యాన్ని ఆరబెట్టాలని రైతులకు సూచించారు. సరైన తేమ వచ్చిన తర్వాత స్థానిక శాసనసభ్యుల సారథ్యంలో ధాన్యం కొనుగోలును ప్రారంభించడం జరుగుతుందని ఆమె తెలిపారు. రైతులు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చినట్లయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందవచ్చని అన్నారు. ఇందుకుగాను రైతులు ధాన్యం ఎక్కువ తేమ లేకుండా, 17% తేమ మీంచకుండా తాలు, తరుగు వంటివి లేకుండా ధాన్యాన్ని తూర్పారబట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్,ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, డి.ఎస్.ఓ వెంకటేష్ ,మార్కెటింగ్ ఏ డి ఛాయా దేవి ,ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

## నేడు మణుగూరు ఐటిఐ నందు జాబ్ మేళా: ఐటీడీఏ పీవో



చర్చ, మణుగూరు:నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులకు మెడక్ ఇంటిగ్రేటెడ్ కన్జ్యూమర్ గూడ్స్ తయారీ, లాజిస్టిక్ (ఐసిఎంఎల్) ద్వారా మణుగూరు ఐటిఐలో బుధవారం జాబ్ మేళ నిర్వహించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఇంటర్ ఒకేషనల్, ఐటిఐ చేసి, 18 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల వయస్సు ఉన్న పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. మిషన్ ఆపరేటర్ పోస్టులకు ఈ ఎంపికలు జరుగుతాయన్నారు. ముఖ్యంగా గిరిజన మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, మొత్తం 40 మందికి అవకాశం కలదని, ఆసక్తిగల గిరిజన యువతీ యువకులు మణుగూరు ఐటిఐ ఆవరణలో జరిగే జాబ్ మేళాలో పాల్గొనాలని కోరారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు





చర్చ, సత్తుపల్లి:ఐసిడిఎస్ కల్లూరు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కల్లూరు మండల పరిధిలోని చండ్రుపట్ల సెక్టార్ రఘునాథగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రఘునాథగూడెం 1వ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసోత్సవాలు మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ సుజాత మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, ఆరు సంవత్సరాల పిల్లలు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అదే విధంగా పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదల కొరకు పిల్లలకు మంచి అలవాట్లు, ఫ్రీ స్కూలు కృత్యాలు, కార్యక్రమాలు గురించి అవగాహన కల్పించారు. బరువు తక్కువ పిల్లల్ని గుర్తించి పోషణ లోపం లేకుండా ఎన్.ఆర్.సి.కి రెఫర్ చేసి వైద్యుల పర్యవేక్షణతో బాలామృతం అందించడం జరుగుతుందని, అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సుజాత, అంగన్వాడి టీచర్లు రేవతి, ప్రియాంక, ఆశా వర్కర్లు, పిల్లల తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ రెచ్చిపోతున్న మట్టి మాఫియా





చర్చ :- అశ్వారావుపేట :అడ్డు అదుపు లేకుండా ఇష్టానుసారం అందినకాడికి మట్టి తొలేస్తూ దోచుకుంటుంది మట్టి మాఫియా అశ్వారావుపేట మండల అధికారులు ఎవ్వరు అడ్డు చెప్పకపోవడంతో వారి అండదండాలు పుష్టిగా ఉంటదంతో అక్రమ మట్టి దందా కొనసాగించేస్తున్నారు. అనుమతులు లేకపోయినా మేమే చూసుకుంటాం అంటూ ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ ఓ గిరిజనేతరుడు తన అంగ బలంతో జమ్మిగూడెం గ్రామంలో అనుమతి లేకుండా యేదేచ్ఛగా సాగుతున్న మట్టి రవాణాను స్థానిక రైతులు అడ్డుకున్నారు. జెసిబిల సాయంతో ప్రభుత్వ భూములలో అడ్డగోలుగా తవ్వి 50 ట్రాక్టర్లతో ఎర్రమట్టిని తరలిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలానే మితిమీరిన వేగంతో ఇష్టానుసారం ట్రాక్టర్లు నడుపుతుండటంతో పొలాలకు వెళ్లేందుకు పోసుకున్న రహదారులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై స్థానిక రెవెన్యూ అధికారులను అడిగితే ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సమాధానం ఇస్తున్నారు. అయితే అక్రమ మట్టి రవాణాను అడ్డుకోకుండా అధికారులు మౌనంగా ఉండటం పట్ల గ్రామస్థులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ మట్టి తొలకంపై విచారణ చేపట్టి మట్టిరవాణాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## రక్తదానం చేసిన షేక్ బడేసాహెబ్




చర్చ, సత్తుపల్లి:తుర్కా కాశ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బడే సాహెబ్ ఆపదలో ఉన్న రోగి కోసం బి పాజిటీవ్ గ్రూపు రక్తం అత్యవసరమని తెలుసుకుని మానవత్వంతో స్పందించి రక్తదానం చేశారు. వివరాల్లోకి వెళితే చిన్న పాకాలగూడెం గ్రామానికి చెందిన గౌర ముత్యాల రాణికి కడుపులో కణితి ఉన్నందున అత్యవసర పరిస్థితిలో ఆపరేషన్ చేయడం కోసం బి పాజిటివ్ గ్రూప్ రక్తం అత్యవసరమని సత్తుపల్లి పట్టణంలో గల చందమామ ఆసుపత్రి వైద్యులు చెప్పడంతో ఆమె కుటుంబ సభ్యుల ద్వారా విషయం తెలుసుకున్న షేక్ బడే సాహెబ్ మాన వత్వంతో ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు షేక్ బడే సాహెబ్‌ను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఆపదలో ఉన్న వారికి ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఆదుకోవాలని కోరారు. ముత్యాల రాణి కుటుంబ సభ్యులు షేక్ బడే సాహెబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రంథాలయానికి వాటర్ ప్యూరిఫైయర్ బహూకరించిన కొల్లి ఫౌండేషన్







చర్చ, ఇల్లందు:గ్రంథాలయాలు సరస్వతికి నిలయాలని, విజ్ఞానం అందించే గ్రంథాల యాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి అన్నారు. ఇల్లందు పట్టణంలోని గ్రంథాలయానికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వాటర్ ప్యూరి ఫయర్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలని, అలా చేరటానికి నేడు గ్రంథాల యాలు ఎంతగానో ఉపయో గపడు తున్నాయని, వాటి అభివృద్ధిలో భాగంగా జిల్లా గ్రంథా లయ చైర్మన్ వీరబాబు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు ఆర్.రుక్మిణి, కొల్లి ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ రూప్లనాయక్, యూత్ కాంగ్రెస్ లీడర్ సన్నీ విద్యార్థినీ విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికుల ను ఆదుకోవాలి: సరెడ్డి పుల్లారెడ్డి




చర్చ, మణుగూరు:ఆటో కార్మికుల ను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలుచేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ ఏఐటీయూసీ మహాసభ రాయల బిక్షం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి సరెడ్డి పుల్లారెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఆటో కార్మికుల పరిస్థితి అధ్వానంగా ఉందని, రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వలన ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలు ఆటోడ్రైవర్లకు అందించాలని అన్నారు. సిపిఐ మణుగూరు పట్టణ, మండల కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబులు మాట్లాడుతూ ఆటో కార్మికులు ఐకమత్యంతో కలిసి మెలిసి జీవించాలని, ప్రయాణికులతో సత్ప్రవర్తన కలిగి ఉండాలని, ఆదర్శంగా నిలవాలని, ఆటో కార్మికులకు ఏఐటీయూసీ, సీపీఐ అండగా నిలబడుతాయని అన్నారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షులుగా ఎన్.ఎన్. రాజు, కార్యదర్శిగా మందారి పుల్లయ్య, గౌరవాధ్యక్షులుగా చారిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, మ్యాజిక్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చారి, సిరిగదే సతీష్, కొత్తపల్లి సత్యనారాయణ, ప్రసాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అధునాతన బ్రాంకోస్కోపిక్ క్రయో అడిషన్ టెక్నిక్ విధానంలో ఊపిరితిత్తుల చికిత్స

- విజయవంతంగా చికిత్స అందించిన హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్




చర్చ, కొత్తగూడెం:భద్రాద్రి జిల్లాకు చెందిన శ్యామల రేణుక అనే పేషెంట్‌కు హెమోప్టిసిస్‌తో ఎడమ ఊపిరితిత్తుల పనితీరు ఆగిపోయిన నేపథ్యంలో అరుదైన, సంక్లిష్టమైన కేసును తీసుకుని హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ విజయవంతంగా చికిత్స అందించింది. దీనికి సంబంధించిన వివరాలను కొత్తగూడెం శ్రీ కృష్ణ ఇన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యశోద హాస్పిటల్స్ బృందం తెలిపారు. ఈ సందర్భంగా ఇంటర్వేషనల్ పల్మోనాలజీ స్లీప్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కిషన్ శ్రీకాంత్ జువ్వా మాట్లాడుతు పేషెంట్‌కు తీవ్రమైన జ్వరం, శ్వాస ఆడకపోవడం, కఫంతో దగ్గు పది రోజులకు పైగా హెమోప్టిసిస్ సమస్య ఉన్నాయని, తమ ఆసుపత్రిలో చేరిన తర్వాత, ఛాతీ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సీటీ థొరాసిక్ యాంజియోగ్రఫీతో సహా వివరణాత్మక వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ప్లూరల్, పెరికార్డియల్ ఎఫ్యూషన్‌తో ఎడను ఊపిరితిత్తులు పూర్తిగా పనితీరు ఆగిపోయి, దీర్ఘకాలిక వ్యాధుల వలన రక్తహీనత, తీవ్రమైన మూత్రపిండాల గాయం వలన పేషెంట్ పరిస్థితి మరింత క్లిష్టంగా మారినట్టు గుర్తించామని వివరించారు. తమ బృందం క్రయో అడెషన్ టెక్నాలజీని ఉపయోగించి చికిత్స, బ్రోంకోస్కోపీని నిర్వహించి, ట్రాకియోబ్రోన్నియల్ ట్రీను అడ్డుకునే పెద్ద గడ్డలు, స్రావాలను తొలగించి, ఊపిరితిత్తులు విజయవంతంగా తిరిగి విస్తరించడానికి వీలు కల్పించారన్నారు. ఈ ప్రక్రియ తర్వాత పేషెంట్‌కు యాంటీబయాటిక్స్, ఛాతీ ఫిజియోథెరపీ, ప్రోత్సాహక స్పిరోమెట్రీతో చికిత్స అందించడం ద్వారా గణనీయమైన మెరుగుదల కనిపించిందన్నారు. రేణుక పూర్తిగా కోలుకునేలా పల్మోనాలజీ, కార్డియాలజీ విభాగాలతో తదుపరి సంరక్షణను కొనసాగిస్తారని వివరించారు

## నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన వ్యక్తి లక్ష్మీనారాయణ






చర్చ, సత్తుపల్లి:ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, తను నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన నిజమైన కమ్యూనిస్టు తన్నీరు లక్ష్మీనారాయణ అని సీపీఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, మాదినేని రమేష్‌లు కొనియాడారు. కల్లూరు పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకులు తన్నీరు లక్ష్మీనారాయణ 16వ వర్ధంతి మండల కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మనిషికి పుట్టుక, మరణం సహజమని, ఈ మధ్యకాలంలో వారు ప్రజల కోసం చేసిన మంచి పనులే జీవితాంతం గుర్తుంచుకునేలా చేస్తాయన్నారు. పార్టీ కార్యకర్తలందరూ సమాజం కోసం, పేదల, రైతుల, కార్మికుల కోసం, వారి హక్కుల రక్షణ కోసం పనిచేయాలని కోరారు. ఈ సందర్భంగా తన్నీరు లక్ష్మీనారాయణ చిత్రపటానికి రాష్ట్ర పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యు లు జాజిరి శ్రీనివాస్, మెరుగు సత్యనా రాయణ, డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు తన్నీరు కృష్ణాజిల్లారావు, పెనుబల్లి మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నాయకులు పులి కృష్ణయ్య, చిమట విశ్వనాథం, రాజనేని మంగ మ్మ, కువ్వారపు లక్ష్మణరావు, నాయుడు చంద ర్రావు, సామినేని వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో బిఆర్ఎస్ నాయకుడు కోనేరు మృతి



చర్చ, సత్తుపల్లి:సత్తుపల్లి పట్టణానికి చెందిన 5వ వార్డు బిఆర్ఎస్ యువ నాయకుడు కోనేరు శ్రీనివాస్ (45) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, సన్నిహితులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

## నియోజకవర్గానికి రూ.10.62 కోట్ల ఈజీఎస్ నిధులు

- కూనంనేని కృషితో రహదారులు, డ్రైన్ల నిర్మాణానికి ఆమోదం
- త్వరలో పనులు ప్రారంభిస్తాం : ఎమ్మెల్యే కూనంనేని



చర్చ, భద్రాద్రి కొత్తగూడెం :నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద నియోజకవర్గానికి రూ.10.62 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో రహదారులు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

ఇప్పటికే గతంలో మంజూరైన నిధులతో అనేక గ్రామీణ ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులు పూర్తికాగా, మరికొన్ని పనులు చివరి దశలో ఉన్నాయి. తాజాగా విడుదలైన ఈ నిధులతో మిగిలిన రహదారుల పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయనున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని తెలిపారు.

గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన చెప్పారు. అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్, త్రాగునీటి వసతుల వంటి అంశాలపై దశలవారీగా చర్యలు తీసుకుంటున్నాం. గత ఇరవై నెలల్లో యాభై శాతం మేర రహదారి పనులు పూర్తి చేశాం. కొత్తగా మంజూరైన రూ.10.62 కోట్లతో మిగిలిన పనులు త్వరితగతిన పూర్తిచేస్తాం అని ఎమ్మెల్యే కూనంనేని వెల్లడించారు.త్వరలో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించనున్నట్లు కూడా ఆయన తెలిపారు.

# మహాత్ముల లక్షణాలు

**కులములోన నొక్కడు గుణవంతుడుండిన**
**కులము వెలయు వాని గుణము చేత**
**వెలయు వనములోన మలయజంబున్నట్లు**
**విశ్వదాభిరామ వినుర వేమ**

**దీని భావం:-** అడవిలో ఒకే ఒక మంచి గంధపు చెట్టున్ననూ ఆ అడవి అంతటిని తన సుగంధమును వ్యాపింపజేయును. అట్లే వంశములో ఒక్క ఉత్తముడున్ననూ వాని గుణముల చేత ఆ వంశమంతయు మంచి పేరు పొందును.

అలాగే సమాజంలో మంచి గుణశాలి సైతం మంచి గంధపు సుగంధము వలెనే వన్నె తెస్తారు. తమ ఉత్తమ గుణాలు, ఉత్తమ ఆలోచనలు, ఉత్తమ క్రియలు, ఉత్తమ అభిరుచులతో సమాజంలో ఉత్తమోత్తములుగా గుర్తించబడుతుంటారు. వీరే మహాత్ములు. అంటే ఘనమైన ఆత్మ కలవారు. జాలి, దయ, కరుణ గుణాలు వారికి ఆభరణాలుగా ఉంటాయి. ఈ గుణాల ప్రభావంతో నిరంతరం వారు పరిమళిస్తూనే ఉంటారు.

జాలి దయ లనేవి కనికరాన్ని చూపే గుణాలు. కృప పొందుటకు మొదటి మెట్టు. కృపా నిత్యము నిలిచి ఉంటే దేవుని ఇక సన్నిధి తోడుగ ఉన్నట్లే! ఎందుకంటే జాలి, దయ, కరుణాలనేవి దేవుని గుణాలుగా అభివర్ణించబడ్డాయి. తమ పొరుగువారి పట్ల దయ, జాలి, తధానుభూతి చూపించాలని



స్పష్టం చేయబడింది. మరీ ముఖ్యంగా అనాధలు, విధవలు, పేదవారు, పీడితుల పట్ల జాలి, దయ, కనికరం కలిగి ఉండాలనీ స్పష్టం చేయబడింది.

ఇక కరుణ విశ్వాసానికి గుర్తుగా ఉంటుంది. జాలి, కరుణ, దయ కనికరాన్ని కలిగి ఉండటమే మహాత్ముల ప్రత్యేకత. ఫలితంగా వారు భగవంతుని నిండు దీవెనలను పొందుతుంటారు. కృపకు పాత్రుల వుతుం టారు. మరో రీతిలో జాలి, దయ, కరుణ ఇవన్నీ పర్యాయ పదాలుగా కనిపించినా, కాస్త లోతుగా ఆలోచిస్తే వాస్తవ భావాలు వెల్లడ వుతాయి. ఉదాహరణకు మనం ఉపాహా రం/భోజనం తీసుకునే సమయంలో ఎవరేని ఆకలితో అలమటిస్తూ ఉంటే వారికి అట్టి ఆహారాన్ని అందిస్తే దానిని స్వీకరిస్తూ వారు పొందే ఆనందాన్ని గమనించవచ్చు. ఈ సన్నివేశం మనకెంతో ఆనందాన్ని, ఆత్మ సంతృప్తిని కలిగిస్తుంది. దీన్ని కొనలేం! ఇదే జాలి గుణ ప్రత్యేకత. జాలి అంటే ఆయా విషయాలపై, ఆయా సంఘటనలపై అప్పటికప్పుడు స్పందించే హృదయాన్ని కలిగి ఉండడమే. ఇదే స్థితి (జాలి) కొనసాగించబడితే తదుపరి అది దయగా రూపుదిద్దుకుంటుంది. ఆ తదుపరి సదరు దయ కార్యరూపం దాల్చితే కరుణగా ప్రతిబింబిస్తూ సుగంధాన్ని విరివిగ విరజిమ్ముతుంది. ఈ గొప్ప గుణాల సమాం తరమే భగవంతుని కృపకు అర్హత సాధిస్తాయి. ఇది గొప్ప ధన్యత.

ఈ మేరకు కడు బీదల పట్ల, అర్హుల పట్ల ప్రత్యేక దయ కరుణ చూపాలంటూ స్పష్టం చేయబడింది కదా!

ఉదాహరణకు ఒక కథ - ఒకానొక భక్తుడు తన ప్రార్థనలో దేవున్ని తన గృహాన్ని దర్శించమని కోర్తాడు. దానికి దేవుడు, సరే! నీ గృహాన్ని ఈ రోజే సందర్శిస్తానంటాడు. వెంటనే భక్తుడు సంభ్రమాశ్చర్యాలతో ఇల్లంతా శు భ్రపరిచి గొప్ప గొప్ప రుచికర వంటకాలను స్వయంగా సిద్ధం చేస్తాడు. చక్కగా స్నానమా చరించి ఇక భగవంతుని రాకపై గృహంలో ఎదురు చూస్తుంటాడు. కొంత సేపటికి ఒక పండు ముసలి వచ్చి అయ్యా! ఆకలిగా ఉంది తినడానికి ఏమైనా ఉంటే వెయ్యమంటాడు. దీంతో సదరు భక్తుడు, కసురుకుంటూ నేను ఒక గొప్ప వి.ఐ.పి రాక కోసం వేచి చూస్తున్నాను. వెంటనే వెళ్లిపో అంటూ గదమాయిస్తాడు. మరి కొంత సేపటికి, మరో బీద ముసలి వ్యక్తి వచ్చి అయ్యా! నాకు చాలా ఆకలిగా ఉంది తినటానికి ఏమైనా ఉంటే వెయ్య మంటాడు. దీంతో సదరు భక్తుడు కసురుకుంటూ బీద ముసలి వ్యక్తిని దురుసుగా వెళ్ళగొడతాడు. తీరా సాయంత్రం, తర్వాత చీకటి అయ్యేసరికి ఎదురుచూస్తున్న దేవుడు రాకపోవడంతో, భక్తుడు దేవుని ప్రార్థిస్తూ దేవా! ఈరోజు తమరు మా గృహాన్ని సందర్శిస్తారని అనేకం చేసి వేచి చూశాను. అయితే తమరు రాలేదు, తమరు ఇచ్చిన మాటను తప్పారంటూ వాపోతారు. దీనికి జవాబుగా భగవంతుడు భక్తా! ఈరోజు నేను పలుమార్లు మీ గృహాన్ని సందర్శించాను. నీవే కసురుకుంటూ వెళ్లగొట్టావంటూ హితబోధ చేస్తాడు. దీంతో సదరు భక్తునికి జ్ఞానోదయమై క్షమించమని దేవుని వేడుకుంటాడు.

ఇది కథే కావచ్చు కానీ వాస్తవానికి ప్రతిరూపం. అవును దీనార్థులను, అనాధలను, పీడితులను ఆదరిస్తే దేవున్ని ఆదరించినట్లే!

కనుక, కడు దీనుల పట్ల, జాలి, దయ, కరుణను కలిగి ఉండాలి. మదర్ థెరిస్సా లో ఈ గొప్ప గుణాలన్నీ గమనించబట్టే సెయింట్ గా చెప్పబడుతుంది. ఇక చరిత్రను ఒక్కసారి పరిశీలిస్తే అలనాడు డేగ వెంటాడుతూ తరిమే పావురపు స్థితిని గ్రహించి తన శరీరాన్ని సైతం లెక్కచేయకుండా ఆహారంగా ఇవ్వడానికి సిద్ధపడిన శిభి చక్రవర్తి తన దయ గుణంతో చరిత్రలో నిలిచిపోయారు కదా!

కష్టాల్లో, ఇబ్బందుల్లో ఉండే వారిని కాపాడే సామర్థ్యం ఉండి, సహాయం చేయకపోవడం అనేది ఆ సామర్థ్యాన్ని వ్యర్థం చేసినట్లే అవుతుంది.

తాను బాధ, కష్టాలలో ఉన్నా, ఆధర్మాన్ని ఎదిరిస్తూ రెక్కలు తెగి తన ఒడిలో ప్రాణాలను కోల్పోయిన జటాయువును తండ్రి సమానంగా ఉత్తరక్రియలు జరిపించాడు శ్రీరాముడు. దయ చూపించడం అనేది దేవుని గుణాలలో ఒకటి. సకల ప్రాణుల పట్ల ప్రేమ, దయను చూపు తున్నందునే సృష్టి కొనసాగించబడుతోంది.

దేవుని గుణాలైనా జాలి, దయ, కరుణ లను చూపుతూ దేవుని కృపకు అర్హత సాధించడమే మహాత్ముల విశిష్ట లక్షణం. ఇట్టి మహాత్ములకు దేవుని దీవెనలు అండ మెండుగ ఉంటాయి. మనుషులను సంతోష పెడుతూ ఆపై దేవున్ని సంతోష పెడితే ఇక ఆ జన్మ ధన్యమే! ఇదే జీవిత పరమార్థం.

డాక్టర్ ప్రభు దయాల్ మాజీ ప్రిన్సిపాల్, గిరిజన విద్యా కళాశాల, భద్రాచలం మాజీ సెనేట్ మెంబర్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్ కొత్తగూడెం

# రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్, వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

● ఎస్పీ రోహిత్ రాజు




**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని జిల్లా పరిధిలో గల ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్‌కు సంబంధించి, విద్యార్థులకు వ్యాసరచన పోటీలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అమరవీరుల ప్రాణ త్యాగాలను స్మరిస్తూ ఈ నెల 21నుండి పలు కార్యక్రమాలు నిర్వహించబడుతాయని తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థులతోపాటు, యువత ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలలో ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో పోలీసుల ప్రతిభను తెలిపే విధంగా ఉండి, ఇటీవల కాలంలో తీసిన 3 ఫోటోలు, 3 నిమిషాలుగల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 25వ తేదీలోపు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ పీఆర్ఓకు సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్, సైజ్ ఫోటోలను అందజేయాలన్నారు. మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను, సైబర్ నేరాలు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం వాటి అనర్దాలు మరియు అవగాహన పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2024 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇప్పటివరకు తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్‌లు మాత్రమే పంపించాల్సి ఉంటుందని సూచించారు. విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని, తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 6వ తరగతి నుండి పీజీ వరకు ఉన్న విద్యార్థులు పాల్గొనవచ్చని తెలియజేసారు. విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబర్ 28వ తేదీలోగా సమర్పించాలని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో 1వ, 2వ, 3వ స్థానాల్లో విజేతలకు బహుమతులు కూడా ప్రదానం చేయబడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి బహుమతులు పొందాలని ఎస్పీ సూచించారు.

# పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్






**చర్చ, భద్రాద్రి కొత్తగూడెం:** వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్‌తోపాటు జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉందని, అందులో సన్నరకం 2,02,862 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 35,315 మెట్రిక్ టన్నులు ఉంటాయని తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలను వివరించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, సాధారణ గ్రేడ్ రకానికి రూ.2,369 మరియు సన్న రకంధాన్యానికి అదనంగా 500 రూపాయలు ప్రతి క్వింటాకు 2889 మద్దతు ధర నిర్ణయించబడిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్‌లు, తేమ కొలిచే యంత్రాలు, తూకపు పరికరాలు, గన్నీ సంచులు వంటి సదుపాయాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులకు టోకెన్ల వ్యవస్థ ద్వారా రద్దీ నియంత్రణ చేపట్టాలని, రైతు ఆధార్ కార్డుతో లింక్ అయిన మొబైల్ నంబర్‌కి వచ్చే ఓటీపీ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. గన్నీ సంచులు ఆన్లైన్‌లో నమోదు చేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలని, సంచులు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. భద్రాద్రి జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుండి ధాన్యం రాకను నివారించేందుకు సరిహద్దుల్లో 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే ఆన్లైన్‌లో నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే లేదా తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత ఇన్‌చార్జిలపై, మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో రావాలని సూచించారు. రైతులకు ధాన్యం విక్రయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంఎస్‌పి ధరలు, నాణ్యత ప్రమాణాలు, సంబంధిత అధికారుల వివరాలు, సన్న వడ్లు మరియు దొడ్డు వడ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి స్పష్టంగా ప్రదర్శించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గన్నీ సంచులకు ట్యాగ్, సెంటర్ నెంబర్ వేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలన్నారు. రైతు ఐరిస్ స్కానర్ ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియ పూర్తి అవుతుందని, రైతు వ్యక్తిగతంగా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. తూకపు బాట్లు తనిఖీ చేసి సీల్స్ వేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీఎంఆర్ 202526 రబీ సీజన్‌కి సంబంధించిన డెలివరీలను సకాలంలో పూర్తి చేసేలా రైస్ మిల్లులను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల అధికారి రుక్మిణి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాధ్ బాబు, డీసీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి బాబురావు, రవాణా శాఖ అధికారి వెంకటరమణ , తూనికలుకొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనందరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఆమె కుమార్తెపై కేసు నమోదు


**జూబ్లీహిల్స్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో పార్టీలన్ని ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్నాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలన్ని అభ్యర్థులను ప్రకటించాయి. ఈ అంశంలో బీఆర్ఎస్ పార్టీ మిగతా పార్టీలతో పోలిస్తే ఓ అడుగు ముందే ఉంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత బరిలో దిగింది. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో.. ప్రస్తుతం ఆమె ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. సునీతతో పాటు ఆమె కుమార్తె మాగంటి అక్షర సైతం ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈక్రమంలో మాగంటి సునీత, ఆమె కుమార్తెకు ఊహించని షాక్ తగిలింది. వారిద్దరి మీద కేసు నమోదయ్యింది. ఆ వివరాలు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కుమార్తెల మీద తాజాగా కేసు నమోదయ్యింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గాను వారిపై కేసు నమోదు చేశారు. మాగంటి సునీత, ఆమె కుమార్తె ఇద్దరూ.. వెంకటగిరిలోని ఓ ప్రార్థన మందిరం వద్ద అనుమతులు తీసుకోకుండా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారి చర్యలతో ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ ఘటనలో మాగంటి సునీత, ఆమె కుమార్తెలతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మీద కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్‌తో పాటు మరో నలుగురి బీఆర్ఎస్ నాయకులు కూడా ఉన్నారు. వీరందరి మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. బీఆర్ఎస్ లీడర్లు అంజద్ అలీఖాన్, ఆజం అలీ, షఫీ, ఫయీం వంటి వాళ్లు.. వెంకటగిరిలోని ఓ ప్రార్థన మందిరం వద్ద బీఆర్ఎస్ పార్టీ కండువాలు ధరించి చేతిలో కరపత్రాలతో కనిపించారు. ఈ ఘటన శుక్రవారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది.దీని గురించి సమాచారం అందిన వెంటనే.. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ డిప్యూటీ తహసీల్దార్ ఫ్రాన్సిస్ తన సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈసమయంలో ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత, ఆమె కుమార్తె, ఇతర బీఆర్ఎస్ నాయకులు.. చేతిలో కార్డులు పట్టుకుని, ప్రార్థనలు చేసుకుని వస్తున్న వారిని.. తమ మాటలతో ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు గుర్తించారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళికి పూర్తిగా విరుద్ధమని, మతపరమైన ప్రదేశాలలో రాజకీయ ప్రచారాలు చేయకూడదని ఫ్రాన్సిస్ స్పష్టం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీని ఆధారంగా జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మసీదు వద్దకు వెళ్లి ప్రచారం చేసినందుకు గానుమాగంటి సునీతను 1గా, ఆమె కూతురు మాగంటి అక్షరను 2గా, మరికొంతమందిని చేరుస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేశారని వారిపై ఆరోపణలు ఉన్నాయి.

# తెలంగాణ జిల్లాల్లో కవిత యాత్ర



**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో ఇటీవలి కాలంలో కల్వకుంట్ల కవిత పెను సంచలనంగా మారారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కవిత. ఆ పార్టీలోని కొందరు నేతలపై సంచలన ఆరోపణలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తెలంగాణ అస్తిత్వం కోసం పోరాటం చేయనున్నట్లు ప్రకటించిన కల్వకుంట్ల కవిత. తెలంగాణ జాగృతి పేరుతో రకరకాల కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా కల్వకుంట్ల కవిత.. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించిన కీలక నిర్ణయం తీసు కున్నారు. తెలంగాణ వ్యాప్తంగా యాత్ర చేపట్టాలని కల్వకుంట్ల కవిత భావిస్తున్నారు.అక్టోబర్ చివరి వారంలో ప్రారంభించనున్న ఈ యాత్రలో భాగంగా తెలంగాణ మొత్తం 33 జిల్లాల మీదుగా కొనసాగేలా ప్రణాళికలు రూపొందించారు. అయితే తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఫొటో లేకుండానే ఈ యాత్రను నిర్వహించాలని కల్వకుంట్ల కవిత నిర్ణయించారు. ఇక ఈ యాత్రలో తన ఫోటోతోపాటు.. తెలం గాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ప్రొఫెసర్ జయశంకర్ ఫొటోను. యాత్ర పోస్టర్లలో డిజైన్ చేయాలని తెలంగాణ జాగృతి శ్రేణులకు కల్వకుంట్ల కవిత ఆదేశాలు జారీ చేశారు.ప్రస్తుతం ఆమె బీఆర్ఎస్ పార్టీ నుంచి బయటికి వచ్చి.. సొంతంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై, కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు, పోరాటం చేస్తున్న నేపథ్యంలోనే కేసీఆర్ ఫోటో ఉంటే.. తమ శ్రేణులకు తప్పుడు సంకేతాలు వెళ్తాయనే ఉద్దేశంతోనే కేసీఆర్ ఫోటో లేకుండా ఈ యాత్రను నిర్వహించాలని భావిస్తున్నారు. ఇక ఇప్పటికే తెలంగాణ మేధావులు, విద్యావంతులతో గత కొంతకాలంగా కల్వకుంట్ల కవిత వరుసగా భేటీ అవుతు న్నారు.ఈ క్రమంలోనే యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం విడుదల చేయనున్నట్లు జాగృతి వర్గాలు వెల్లడిం చాయి. ఇక ఈ యాత్రలో భాగంగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధిం చడం కోసం పోరాటాలు చేసి. ఇప్పుడు ఎవరూ పట్టించు కోకుండా ఉండే వారిని కల్వకుంట్ల కవిత కలవనున్నారు. అంతేకాకుండా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విద్యావంతులు, సామాజిక వేత్తలతోనూ కవిత ముచ్చటించనున్నారు. తెలంగాణ ప్రధాన ఎజెండాగానే తెలంగాణ జాగృతి పనిచేస్తుందని కల్వకుం ట్ల కవిత స్పష్టం చేశారు. బీసీల హక్కుల విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని తేల్చి చెప్పారు.

# వేములవాడ ఆలయ విస్తరణ రాజన్న గుడిలోని దర్గా తొలగింపు



**వేములవాడ:** వేములవాడలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాన ఆలయంలో దర్శనాలు నిలిపివేశారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలోని దర్గాను తొలగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ మేరకు అనేక మంది సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. చాలా ఏళ్లుగా దర్గా తొలగించాలనే డిమాండ్ ఉందని.. చివరకు దాన్ని తొలగించడానికి ప్రభుత్వం ముందుకువచ్చినట్లు చెబుతున్నారు. ఈ దర్గాపై హిందువుల ఆగ్రహానికి కారణం ఏంటంటే?దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి అలయ విస్తరణ పనుల జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాన ఆయలంలో దర్శనాలను నిలిపివేశారు. రాజన్న దర్శనం ఇక నుంచి ఎల్ఈడీ స్క్రీన్‌లలో. రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లోనే భక్తులు దర్శనం చేసుకునే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక కోడె మొక్కలు భీమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తాజాగా తెలిపారు. ఈ నేథ్యంలో రాజన్న ఆలయం గురించి ఓ విషయం తీవ్ర చర్చనీయాంశమైంది. రాజన్న గుడిలోని దర్గాను తొలిగిస్తున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా ప్రధాన ఆలయ ప్రాంగణంలో ఉన్న హజ్రత్ సయ్యద్ తాజుద్దీన్ ఖాజా బాగ్ సవార్ దర్గాను తొలగిస్తున్నట్లు పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. చాలా ఏళ్లుగా హిందువులు చేస్తున్న పోరాటం ఫలించిందని చెబుతున్నారు. ఇది మంచి పరిణామని ప్రభుత్వాన్ని అభినందిస్తున్నారు. దర్గాను వేరే చోటుకు తరలించడానికి ముస్లిం వర్గం, ప్రభుత్వం కలిసి నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కలిసి ముస్లిం వర్గాన్ని ఒప్పినట్లు పేర్కొంటున్నారు. ఈ మేరకు రవీందర్ గౌడ్ అనే వ్యక్తి వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# మాగంటి సునీతని అవమానిస్తారా మంత్రులపై బీఆర్ఎస్ ఫైర్



**హైదరాబాద్, అక్టోబరు14:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్‌లు అవమానించారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. మంత్రులకి అసలు మానవత్వం ఉందా? అని ప్రశ్నించారు.ప్రజల నుంచి వచ్చిన స్పందనతో మాగంటి సునీత కన్నీళ్లు పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. కమ్మ సామాజికవర్గం వాళ్లు ఓట్లు వేస్తే అదే సామాజి కవర్గం నుంచి తుమ్మల నాగేశ్వరరావు మంత్రి అయ్యారని పేర్కొన్నారు. అదే సామాజికవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చనిపోతే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చిందని గుర్తుచేశారు. మాగంటి సునీత బిడ్డలు, కొడుకు ప్రచారం చేస్తే యాక్షన్ ఎలా అవుతుంది.? అని ప్రశ్నల వర్షం కురిపించారు శ్రీనివాస్ గౌడ్.మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే మాగంటి సునీతకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతుంటే పక్కనే మేయర్ ఉన్నారని.. బీఆర్ఎస్ నుంచి గెలిచి మేయర్ కాంగ్రెస్‌లో చేరారని ఫైర్ అయ్యారు. ఈ విషయంలో మహిళా మేయర్ కనీసం స్పందించి ఉంటే బాగుండేదని చెప్పుకొచ్చారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ చనిపోతే దేశవ్యాప్తంగా రాజీవ్ గాంధీ ఫొటోలతో ప్రచారం చేయలేదా..? అని నిలదీశారు. ఆడబిడ్డను మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్ అవమానించారని ఫైర్ అయ్యారు. మంత్రుల భాషను మహిళలు గమనించాలని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక బయటపడ్డ బోగస్ ఓట్లు



**హైదరాబాద్, అక్టోబర్ 14:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బోగస్ ఓట్లు కలకలం రేపుతున్నాయి. వెంగళరావు నగర్‌లో నకిలీ ఓట్లు బయటపడ్డాయి. బూత్ నంబర్ 125లో 27 బోగస్ ఓట్లు ఉన్నట్లు ఎలక్షన్ కమిషన్ అధికారులు గుర్తించారు. ఒకే ఇంట్లో ఒకే వ్యక్తికి 3 ఓట్లు ఉండడంతో బోగస్ ఓట్ల బాగోతం బయటపడింది. దీంతో ఎన్నికల అధికారులకు ఇంటి యజమాని ఫిర్యాదు చేశాడు. తనకు తెలియకుండానే తన ఇంటి నెంబర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు ఓటర్ కార్డులు పొందారని ఇంటి యజమాని చెబుతున్నాడు. ఇంటి ఓనర్ ఫిర్యాదుతో వెంటనే ఎలక్షన్ కమిషన్ అధికారులు విచారణ చేపట్టారు.బోగస్ ఓట్లు బయటపడటంతో వెంగళరావు నగర్ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఓట్లు చోరీ అవుతున్నాయంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు.కాగా. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో దొంగ ఓట్లు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మొన్న యూసఫ్‌గూడలో దొంగ ఓట్లు బయటపడగా.. తాజాగా వెంగళరావు నగర్‌లో బోగస్ ఓట్ల బాగోతం బయటకొచ్చింది. వెంగళరావు నగర్‌లో ఒకే ఇంట్లో 27 ఓట్లు బయటపడగా. వారిలో ఒక ఓటరు మాత్రమే ఆ ఇంట్లో నివసిస్తున్నాడు. మిగిలిన వారు ఎవరో కూడా తమకు తెలియదని యజమాని చెబుతున్నాడు. ఓనర్ భార్య మరణించడంతో ఆ ఇంట్లో యజమాని ఒక్కరే నివాసం ఉంటున్నాడు. ఓటర్ల జాబితాలో ఉన్న వారు ఎవరూ కూడా తమకు సంబంధించిన వారు కాదని, వాళ్లు ఎవరో కూడా తనకు తెలియదని ఇంటి యజమాని చెబుతున్నాడు. ఈ క్రమంలో దొంగ ఓట్లు ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై ఎన్నికల అధికారులు విచారణ చేపట్టారు.

# సూర్యాపేట ఇన్‌చార్జ్ కోసం కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు గాంధీభవన్‌కు తాకిన అలజడి



**సూర్యాపేట :** కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం తర్వాత సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పదవి కోసం కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు మొదలైంది. రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని సూర్యాపేట నియోజక వర్గ ఇన్‌చార్జ్‌గా ప్రకటించాలని ఆయన అనుచరులు కోరుతున్నారు. అధ్యక్ష ఎన్నికల కోసం పరిశీలకులు తెలంగాణలో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వోత్తమ్ రెడ్డిని సూర్యాపేట ఇన్‌చార్జ్‌గా ప్రకటించాలని కోరుతూ రెండు రోజుల క్రితం గాంధీభవన్‌లో ఆయన అనుచరులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.ఇటీవల రాంరెడ్డి దామోదర్ రెడ్డి సంస్మరణ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ఆ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.అయితే ఇవాళ సర్వోత్తమ్ రెడ్డి వర్గానికి పోటీగా పటేల్ రమేష్ రెడ్డి అనుచరుల గాంధీభవన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు అసెంబ్లీ ఎన్నికల్లో చివరి నిముషం వరకు సూర్యాపేట టికెట్ కోసం ప్రయత్నించినా పటేల్ రమేష్ రెడ్డికి దక్కలేదు. ఆయన స్థానంలో రాంరెడ్డి దామోదర్ రెడ్డికి టికెట్ దక్కినా ఆయన గెలవలేకపోయారు. రెండుసార్లు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను త్యాగం పటేల్ రమేష్ రెడ్డికి ఇన్‌చార్జ్ ఇవ్వాలని అనుచరులు గాంధీభవన్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో సూర్యాపేట ఇన్‌చార్జ్‌గా ఎవరిని నియమిస్తారనే అంశం ఆసక్తికరంగా మారింది.

# సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు బీఆర్ఎస్‌పై మంత్రి కొండా సురేఖ ఫైర్



**వరంగల్, అక్టోబరు14:** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. (మంగళవారం) వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీల నేతలు కలిసి స్థానిక ఎన్నికలని అడ్డుకున్నారని ఆరోపించారు.బీసీ రిజర్వేషన్‌కి కట్టుబడి 42శాతం రిజర్వేషన్ ఇస్తున్నామని తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిపి ఆమోదించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా తూర్పు నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ నిధులు అందించామని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల నిధులను తమ ప్రభుత్వం కేటాయించిందని ప్రకటించారు.త్వరలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకి భూమి పూజ చేస్తామని వివరించారు. అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్ కార్డులు అందించామని స్పష్టం చేశారు. త్వరలోనే వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తామని వెల్లడించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేశామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

# వైసీపీ నాయకులు ఎంత దోచుకున్నారో ప్రజలకు తెలుసు



**విశాఖ:** మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజుపై ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మండిపడ్డారు. అదీప్ రాజ్ నిన్ననే నిద్రలోంచి లేచినట్టు ఉన్నారని ఎద్దేవా చేశారు. మద్యం కుంభకోణంలో వైసీపీ నాయకులు ఎంత దోచుకున్నారో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మద్యం కుంభకోణం ఎవరు తనతో చేయించారో ప్రధాన నిందితుడు జనార్ధన్ రావు చెప్పకనే చెప్పాడని పేర్కొన్నారు. దొంగే దొంగ అన్నట్టుగా ఉంది అదీప్ రాజ్ వ్యవహారమని చెప్పుకొచ్చారు. అదీప్ రాజ్ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని ఖండించారు.తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా చేశాను తన క్యారెక్టర్ ఏమిటో ప్రజలకు తెలుసని ఎమ్మెల్యే రమేష్ బాబు ధీమా వ్యక్తం చేశారు. పరవాడలో జరిగిన కల్తీ మద్యం డంపింగ్ గుర్తించిన వెంటనే.. మీడియా సమక్షంలో ఎక్సైజ్ అధికారులకు పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఆదేశాల ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. రాజకీయాలలో అధికారపక్షంగా ఉన్నప్పుడు ఒకలా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలాగా తనది కాదని, తనకంటూ.. ఒక చిత్తశుద్ధి ఉందని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు.

# కారుకూతలు కూస్తే తోలు తీస్తాం జోగికి కొల్లు రవీంద్ర వార్న్



**అమరావతి, అక్టోబర్ 14:** విజయవాడలో మద్యం దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు మంత్రి కొల్లు రవీంద్ర. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ అమ లును మంత్రి స్వయంగా పరిశీలించారు. యాప్ ఉపయోగాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో జోగి రమేష్.. చంద్రబాబు ఇంటికి వచ్చినందుకే వైసీపీ నేతలు డిపాజిట్లు కోల్పోయి పార్టీ అడ్రెస్ గల్లంతైందన్నారు. మళ్లీ చంద్రబాబు ఇంటికొస్తా అంటున్న జోగిరమేష్ కారుకూతలు కూస్తే తోలు తీస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర పన్నారని జనార్ధన్ రావు స్పష్టమైన వాంగ్మూలం ఇచ్చారన్నారు. బందరు పిచ్చోడు పేర్ని నాని రాత్రులు ఆంబోతులా రంకెలు వేసి ఉదయం అదే పోలీసుస్టేషన్‌కు వెళ్లి గడ్డాలు పట్టుకోవటం చూశామన్నారు.కల్తీ మద్యం అంటూ కుట్రకు తెరలేపిన ఏ ఒక్కరినీ వదలమని వార్నింగ్ ఇచ్చారు. కుట్రకు పాల్పడ్డ నిందితులు ఎక్కడ దాక్కున్నా పట్టుకొచ్చి శిక్షిస్తా మన్నారు. శవరాజకీయాల్లో ఆరితేరిన జగన్ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని మండిప డ్డారు. ప్రభుత్వంపై కుట్రలు పన్నుతూ వైసీపీ నకిలీ మద్యం అంటూ ప్రజల్ని భయపెట్టాలని చూస్తోందన్నారు. వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై వాస్తవాలు అన్నీ బహిర్గతం చేస్తున్నామని తతెలి పారు. ఇప్పటి వరకూ 19వేల మంది యాప్ డౌన్లోడ్ చేసుకున్నారని.. ఎక్సైజ్ విధానాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన వ్యవస్థను గాడిలో పెట్టామని.. శాఖాపరంగా ఎవరు తప్పు చేసినా వదిలి పెట్టమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# విశాఖ ఏఐ రాజధానిగా మారుతుంది



**కర్నూలు, అక్టోబరు14:** విశాఖపట్నానికి గూగుల్ ఏఐ హబ్) రావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచుతుందని ఏపీ రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖపట్నానికి రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమని అభివర్ణించారు. (మంగళవారం) కర్నూలు జిల్లాలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.సీఎం చంద్రబాబు ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలని తీసుకువచ్చి హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారని.. ఇవాళ విశాఖకు గూగుల్‌ని తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చుతున్నారని ప్రశంసించారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, సమర్థవంతమైన నాయకత్వం ఉండటంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని వివరించారు మంత్రి అనగాని సత్యప్రసాద్.సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు కష్టపడుతూ వివిధ కంపెనీల ప్రతినిధులతో గంటల కొద్దీ చర్చలు జరిపి ఏపీకి పరిశ్రమలను తీసుకొస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో ఏపీకి రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు వచ్చాయని వెల్లడించారు. గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందుతాయని తెలిపారు. సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ నగరం డిజిటల్ సిటీకి రాజధానిగా మారతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# ప్రధాని పర్యటనకు 1,800 మంది పోలీసులతో భద్రత



**శ్రీశైలం :** ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామివారలను దర్శించుకున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్ వెల్లడించారు. 1800 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. శ్రీశైలంలో మంగళవారం పోలీస్, లైజనింగ్ అధికారులతో భద్రతపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి హెలిపాడ్‌కు చేరుకున్నప్పటి నుంచి దర్శనం అనంతరం తిరిగి వెళ్లే వరకు.. ఆయన పర్యటించే ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాలని సూచించారు.కీలక ప్రాంతాలు, కూడళ్లలో సాయుధ బలగాలతో పికెట్ ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేశామన్నారు. బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని పది సెక్టార్లుగా విభజించి. సెక్టార్‌కో ఉన్నతాధికారిని ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిపారు. జియోగ్రా ఫికల్ మ్యాప్ ద్వారా ప్రధాని పర్యటించే ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో భారీ భద్రత ఉంటుందని.. రోడ్డు మార్గాలు, కీలక కూడళ్లు, ఆలయ ప్రాంతాల్లో రూఫ్‌టాప్ సిబ్బందిని నియమించి వారికి బైనాక్యులర్‌తో నిరంతరం పరిశీలించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. శ్రీశైలానికి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని.. 24/7 కొనసాగించాలని చెప్పారు. కమాండ్ కంట్రోల్‌లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ కెమెరాలను పరిశీలించాలని.. ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.హెలిపాడ్, గుడి, శివాజీ స్ఫూర్తి కేంద్రం ప్రాంతాల్లో ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలలో యాక్సెస్ కంట్రోల్ ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రౌడ్ కంట్రోల్ కోసం రూఫ్ టాప్, క్యూఆర్టీ, స్పెషల్ పార్టీలను నియమించుకోవాలని ఆదేశించారు. ప్రధాని పర్యటనకు వచ్చిన సుమారు 1800 మంది పోలీస్ అధికారులు సిబ్బందికి ప్రత్యేకమైన డ్యూటీ పాసులను జారీ చేసినట్లు చెప్పారు. డ్యూటీలో ఉన్న పోలీసు అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ ఐడీ కార్డులు ధరించాలని సూచించారు.

# విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ప్రారంభంపై నిర్మలమ్మ ఆసక్తికర ట్వీట్



**విశాఖపట్నం :** భారత టెక్నాలజీ రంగంలో మరో చారిత్రక ఘట్టం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 1 గిగావాట్ సామర్థ్యం గల హైపర్ స్కేల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి గూగుల్ భారీ పెట్టుబడితో ముందుకు వచ్చింది. ఈ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా దిల్లీలో జరిగిన 'భారత్ ఏఐ శక్తి' కార్యక్రమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. "దిల్లీలో జరిగిన కార్యక్రమంలో గూగుల్ ఏఐ ప్రాజెక్టు ప్రారంభం ఒక చారిత్రక సందర్భం.గూగుల్ సీఈవో సుందర్ పిచ్చాయ్‌మరోవైపు.. ఏపీలో ఏఐ హబ్, డేటా సెంటర్ ఏర్పాటుపై అంతర్జాతీయంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో గూగుల్ అండ్ ఆల్ఫాబెట్ సీఈవో సుందర్ పిచాయ్ ట్వీట్ చేశారు. ఈ హబ్‌లో గెగావాట్ - స్కేల్ కంప్యూట్ కెపాసిటీ, నూతన అంతర్జాతీయ సబ్ సీ గేట్ వే ఉన్నాయని వివరించారు. అతిపెద్ద విద్యుత్ సామర్థ్యంతో కూడిన హైపర్ స్కేల్ డేటా సెంటర్ క్యాంపస్ ప్రారంభమైంది. గూగుల్ రాబోయే ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ. 80,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ప్రధాని నరేంద్ర మోదీ గారి దూరదృష్టి విధానాల వల్ల భారత్ నేడు డిజిటల్ ఫౌంటెన్‌హెడ్‌గా అవతరించింది. ఇప్పుడు భారత్ ఏఐ, క్వాంటమ్ రంగాల్లో కూడా ప్రపంచానికి నాయకత్వం వహించబోతోంది. ఈ దిశగా సీఎం చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న అద్భు తమైన ముందడుగు అభినందనీయం" ఆమె ట్వీట్‌లో పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టుతో విశాఖపట్నం ప్రపంచ టెక్ మ్యాప్‌పై కొత్త కేంద్రముగా నిలవనుంది. గూగుల్ ప్రతినిధులు చెబుతున్న వివరాల ప్రకారం.. ఈ హబ్ ద్వారా 12 దేశాలకు సబ్‌సీ కేబుల్ కనెక్టివిటీ ఏర్పాటుచేస్తారు. ఇది భారత్‌లో డేటా భద్రత, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కృత్రిమ మేధ రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీయనుంది.'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా విశాఖలో గూగుల్ ఏఐ హబ్ మరో మహా మైలురాయిగా నిలవనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

ఆధారిత మౌలిక సదుపాయలు ఉండనున్నాయని వెల్లడించారు. తమ మెరుగైన సాంకేతికతను భారతీయ పెట్టుబడుదారులకు, ప్రజలకు అందించే కార్యక్రమం ఇదని అభివర్ణించారు. దేశం మొత్తం ఏఐని మరింత వేగవంతం చేయడంలో.. మరిన్ని పరిశోధనలకు ఇది ఆస్కారం ఇస్తోందని గూగుల్ సీఈవో సుందర్ పిచ్చాయ్ పేర్కొన్నారు. విశాఖ ఏఐ సిటీలో 1 గిగావాట్

# లిక్కర్ స్కాంలో సిట్ దూకుడు పీఎల్ఆర్ ప్రాజెక్ట్సలో సోదాలు



**అమరావతి/హైదరాబాద్, అక్టోబర్ 14:** మద్యం కుంభకోణం కేసులో ఏ4 నిందితుడిగా ఉన్న వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌లో ఏపీ సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌లో నలుగురు సిట్ అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. ఏపీ లిక్కర్ స్కాం డబ్బులు పీఎల్ఆర్ ప్రాజెక్టులోకి మళ్లించినట్లు ఆధారాలు ఉన్న నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయి. పీఎల్ఆర్ ప్రాజెక్టులోకి రూ.15 కోట్లు, డికాట్ లాజిస్టిక్స్ నుంచి రూ. 25 కోట్లు మళ్లించినట్టు సిట్ గుర్తించింది. దీంతో నిధుల మళ్లింపుపై పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్‌లో సిట్ బృందం ఆధారాలు సేకరిస్తోంది. అందుబాటులో ఉన్న సిబ్బంది నుంచి అధికారులు వివరాలను సేకరించే పనిలో ఉన్నారు.మరోవైపు మిథున్ రెడ్డి నివాసంతో పాటు పలు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరులోని నివాసాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు సిట్ అధికారులు. హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్, ప్రశాసన్ నగర్, యూసుఫ్ గూడ గాయత్రీహిల్స్‌లోని మిథున్ నివాసాల్లో సిట్ బృందం సోదాలు చేస్తోంది. అలాగే కొండాపూర్‌లోని కార్యాలయంలోనూ సిట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో కీలక పత్రాలను సీజ్ చేసినట్లు సమాచారం. కాగా.. మద్యం కుంభకోణంలో ఏ4గా ఉన్న ఎంపీ ఈ కేసులో అరెస్ట్ అయి ఇటీవలే బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే.ఇదిలా ఉండగా.. ఈనెల 20న యూఎస్ వెళ్లాలంటూ ఎంపీ మిథున్ రెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై ఈరోజు (మంగ ళవారం) న్యాయస్థానం విచారించనుంది. 27న యూఎస్‌లో జరిగే భేటీలో పాల్గొనాల్సి ఉందని.. అక్కడకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోర్టును ఎంపీ మిథున్ రెడ్డి కోరారు.

# పేదవాడి ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం: ఎంపీ కేశినేని



విజయవాడ, అక్టోబర్ 14: గవర్నమెంట్ హాస్పిటల్‌లో అభివృద్ధిపైల (మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ప్రభుత్వ హాస్పిటల్‌లో ఏమేమి లోటుపాట్లు ఉన్నాయనే అంశంపై చర్చించారు. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. హాస్పిటల్లో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించామని. తాము ఊహించిన దానికన్నా డాక్టర్లు ఎక్కువ అభివృద్ధి చేస్తున్నారన్నారు. పెద్దపెద్ద హాస్పిటల్స్‌లో అవ్వని ఆపరేషన్స్ ప్రభుత్వ హాస్పిటల్లో చేసి కేసులు సాల్వ్ చేస్తున్నారని తెలిపారు. వైద్యులు కొన్ని రిక్వైర్మెంట్స్ అడిగారని. వాటిని త్వరలోనే వాళ్లకు అందజేస్తామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. త్వరలో కన్స్ట్రక్షన్ రెడీ అయిపోతే మరిన్ని అధునాతన పరికరాలతో ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పేదవాడి కోసం ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎంపీ కేశినేని చిన్ని హామీ ఇచ్చారు.అధునాతన పరికరాలు అందిస్తాం: బోండా ఉమాప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన రివ్యూ మీటింగ్‌లో డాక్టర్లను అభినందించామని ఎమ్మెల్యే బోండా ఉమా తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన హెచ్ఓడీలు ఈ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్నారన్నారు. డాక్టర్లు రోగులకు మంచి సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు హాస్పిటల్లో కూడా చేయలేని కేసులకు ఆపరేషన్ చేసి రోగులను బతికించారని డాక్టర్లను అభినందించారు. మరిన్ని అధునాతన పరికరాలు డాక్టర్లు కోరారని.. వాటిని కూడా సమకూర్చేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. నూతన బిల్డింగ్ సిద్ధం అవ్వగానే మరిన్ని అత్యాధునిక పరికరాలతో ప్రజలకు సేవలు అందిస్తామని ఎమ్మెల్యే బోండా ఉమా వెల్లడించారు.డాక్టర్లను అభినందించడం సంతోషం: వెంకటేశ్వర్లుసరైన సమయంలో సరైన వైద్యం అందిస్తున్నందుకు రివ్యూ మీటింగ్‌లో కలెక్టర్, ఎంపీ.. తమను అభినందించారని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్నెం ట్ ఏ వెంకటేశ్వర్లు తెలిపారు. డాక్టర్లని అభినందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమకు కావాల్సిన కొన్ని అత్యాధునిక పరికరాలు కోసం కలెక్టర్, ఎంపీకి చెప్పామని.. వాటిని వెంటనే అందిస్తామన్నారని చెప్పారు. తాము అడిగిన ప్రతిపాదనన్నింటికీ కలెక్టర్, ఎంపీ ఒప్పుకున్నారని ప్రభుత్వ ఆసుపత్రి సూపర్నెంట్ ఏ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

# రాష్ట్ర చరిత్రలో సువర్ణ అధ్యాయం: హోంమంత్రి అనిత



**అమరావతి, అక్టోబర్ 14:** గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు ఒప్పందం శుభ పరిణామమని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ. రాష్ట్ర చరిత్రలో ఇదొక సువర్ణ అధ్యాయంగా అభివర్ణించారు. గూగుల్ డేటా సెంటర్ రాకతో ఉత్తరాంధ్ర ప్రపంచ పటంలో నిలవనుందన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుతో 1.88 లక్షల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. గతంలో సీఎం చద్రబాబు హైదరాబాద్?లో హైటెక్ సిటీ అభివృద్ధి చేశారని.. ప్రస్తుతం విశాఖను ఐటీ హబ్?గా తీర్చి దిద్దబోతున్నారని అన్నారు. ఆనాడు హైదరాబాద్?కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చారని. ప్రస్తుతం విశాఖకు గూగుల్?ను తీసుకొస్తున్నాంని పేర్కొన్నారు.సాంకేతికతతో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయన్నారు. ఉత్తరాంధ్ర వాసిగా ఎంతో సంతోష పడుతున్నానని అన్నారు మంత్రి. విశాఖను ఐటీ హబ్‌గా మార్చుతున్న సీఎం చంద్రబాబుకు, ఐటీ మంత్రి లోకేష్‌కు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేశారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు విశేష కృషి చేసిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌కు విశాఖ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు హోంమంత్రి అనిత. గూగుల్ రాక ఏపీలో గేమ్ ఛేంజర్: యార్లగడ్డటెక్ ప్రపంచంలో ఏపీకి చారిత్రాత్మక రోజు అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట రావు అన్నారు. గూగుల్ క్లౌడ్?తో ఏపీ ప్రభుత్వం కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని తెలిపారు. గూగుల్ ఆంధ్రప్రదేశ్?లో అడుగుపెట్టిందని.. డిజిటల్ ఇన్నో వేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. గూగుల్ రావడం ఆంధ్రప్రదేశ్‌లో గేమ్ చేంజర్ కాబోతుందని అన్నారు. మైక్రోసాఫ్ట్ హైదరాబాద్ వచ్చిన తరువాత అనేక ఐటీ కంపెనీలు హైదరాబాద్‌కు క్యూ కట్టాయన్నారు. హైదరాబాద్‌ను స్వరూపం మార్చివేసిందని గుర్తుచేశారు. అదే విధంగా గూగుల్ రాకతో ఏపీలో కూడా ఐటీ రంగం మరింత అందుకోనుందని యార్లగడ్డ వెంకటరావు ధీమా వ్యక్తం చేశారు.

# నకిలీ మద్యం కేసులో మరో కీలక పరిణామం



**అమరావతి, అక్టోబర్ 14:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో సంచలన విషయాలు రోజుకొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా నకిలీ మద్యం కేసులో ఏ1 నిందితుడు జనార్దన్ రావు, మాజీ మంత్రి జోగి రమేశ్ మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణ చాటింగ్ మంగళవారం లీక్ అయింది. తనకు కాల్ చేయాలని జనార్దన్ రావుకు జోగి రమేశ్ మెసేజ్ పెట్టారు.తన ఇంటికి రావాలంటూ తొలుత మెసేజ్ పెట్టి.. ఆఫ్రికా ఎప్పుడు వెళ్తున్నావంటూ జనార్దన్ రావును జోగి రమేశ్ అడిగారు. ఒక్కసారి ఫేస్ టైమ్‌లో మాట్లాడాలని జనార్దన్ రావుకు జోగి రమేశ్ మెసేజ్ పెట్టారు. ఈ వాట్సాప్ చాటింగ్‌ను పోలీసులు ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు.అయితే ప్రస్తుతం మళ్లీ నకిలీ మద్యం తయారు చేయాలని మాజీ మంత్రి జోగి రమేశ్ తనను ఆదేశిస్తేనే.. ఈ పనికి పూనుకున్నట్లు ఈ కేసులో నిందితుడు జనార్దన్ రావు ఇప్పటికే వెల్లడించారు. జోగి రమేశ్ ఆదేశాలతోనే గతంలో సైతం నకిలీ మద్యం తయారు చేసేవాడినని చెప్పారు.కానీ ప్రభుత్వం మారిన తర్వాత నకిలీ మద్యం తయారీని తాను నిలిపి వేసినట్లు జనార్దన్ రావు తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు నకిలీ మద్యం తయారు చేయాలని జోగి రమేశ్ ఆదేశాల మేరకే తాను ఈ నకిలీ మద్యం తయారు చేయడం ప్రారంభించానని జనార్దన్ రావు వివరించారు.అదికూడా ఉమ్మడ చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లెలోనే ఈ నకిలీ మద్యం తయారు చేయమడం వెనుక ఉన్న గల కారణాలను సైతం జనార్దన్ రావు ఈ సందర్భంగా వెల్లడించారు. అలాగే జోగి రమేశ్‌తో తనకు ఉన్న సన్నిహిత సంబంధాలున్నాయని వివరించారు. ఇక గత ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యాన్ని తాను తయారు చేసినట్లు జనార్దన్ రావు ఇటీవల విడుదల చేసిన వీడియోలో వెల్లడించిన విషయం విదితమే.మరోవైపు ఈ నకిలీ మద్యం కేసు దర్యాప్తును ప్రభుత్వం సిట్‌కు అప్పగించింది. కృష్ణా,గోదావరి జిల్లా రేంజ్ డీఐజీ అశోక్ కుమార్‌ను ఈ సిట్‌కు హెడ్‌గా నియమించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ కేసులో పురోగతిని ప్రభుత్వానికి తెలియజేయాలని జారీ చేసిన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

# మమతా బెనర్జీ బాధ్యతా రాహిత్యం

సమాజంలో రాక్షస ప్రవృత్తి పెరుగుతోంది. అత్యాచారాలు, హత్యలు, హత్యాకాండలు పెచ్చుమీరడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా వరుస ఘటనలు తీవ్రమైనవిగా పరిగణించాలి. ప్రభుత్వాలు ఈ తరహా నేరాలపై అధ్యయనం చేయాలి. కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఎపి, తెలంగాణ ఇలా అనేక రాష్ట్రాల్లో సభ్యసమాజం తలదించుకునేలా ఘటనలు జరుగుతున్నాయి. చివరకు చిన్నారి బాలలపైనా మూర్ఖులు లైంగికదాడులకు పాల్పడడం దారుణం. హైదరాబాద్‌లో, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలలపై ఉపాధ్యాయులే లైంగిక దాడికి తెగించడం దుర్మార్గపు చర్య. ఇలాంటి వారిని బహిరంగం గానే ఉరితీయాలి. ఇకపోతే మళ్లీ అక్కడక్కడా పరువు హత్యలు సాగుతున్నాయి. కులాలు, మతాలు కలవక పోవడంతో ప్రేమ పెళ్లిళ్లకు అడ్డుపడుతున్నారు. ఇలా సమాజంలో భయం లేకపోవడం వల్ల, చట్టాల్లో లొసుగుల వల్ల ప్రజల్లో రాక్షసత్వం పెరిగిపోతోంది. అత్యాచారాలు సులవుగా చేసేస్తున్నారు. దొంగతనాలు, హత్యలకు కొదువే లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రహితంగా ఉన్నాయి. అత్యాచార ఘటనపై స్పందిస్తూ..అర్ధరాత్రి ఆ అమ్మాయి ఒంటరిగా ఎందుకు బయటకు వచ్చిందని పెడసరంగా ప్రశ్నించారు. ఒక సిఎంగా ఉన్న మమత మహిళ అయినా ఇలాంటి విషయాల్లో కనీస ఇంగితం లేకుండా మాట్లాడారు. కొన్నేళ్లుగా మహిళలపై నేరాల్లో బెంగాల్, కోల్‌కతా ముందువరసలో ఉంటున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో వార్షిక నివేదికలు ఘోషిస్తున్నాయి. దుర్గాపూర్ అత్యాచార దుర్ఘటనను ఖండిస్తూ మహిళలు, విద్యార్థులు, డాక్టర్స్ సంఘాలు, ఆరోగ్య కార్యకర్తల నుంచి రెండు రోజులుగా ఆందోళనలు పెల్లుబకగా, బాధ్యత కలిగిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత స్పందన బాధితు రాలిని, కుటుంబ సభ్యులను, యావత్ మహిళాలోకాన్ని కించపరిచింది. రాత్రిపూట క్యాంపస్ నుంచి బయటికి ఎందుకు వెళ్లింది, ఆ సమయంలో ఏం పని, అని సిఎం అసహనం చెందారు. ఏ సమయంలోనైనా బయటికి వెళ్లడం ప్రాథమిక హక్కు అయినప్పటికీ స్త్రీలు రాత్రుళ్లు రోడ్లపైకి రాకూడదని విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క మహిళ ఇంటి ముందు పోలీసులను కాపలాగా పెట్టలేమంటూ మహిళా భద్రతపై చేతులెత్తేశారు.పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లో ఐక్యూ ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థినిపై కాలేజీ క్యాంపస్ పరిసరాల్లో జరిగిన సామూహిక అత్యాచారం బెంగాల్‌లో మహిళా భద్రతా వైఫల్యాన్ని మరొకసారి బట్టబయలు చేసింది. ఒరిస్సాకు చెందిన విద్యార్థిని వైద్య విద్యనభ్యసించేందుకు ఆ కాలేజీలో చేరగా ఈ ఘోరం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితునితో కలిసి డిన్నర్‌కు క్యాంపస్ వెలుపలికి వెళ్లగా విద్యార్థినిని మృగాళ్లు అటకాయించి చేతిలోని ఫోన్‌ను లాక్కొని దగ్గరలోని దట్టమైన చెట్లలోకి బలవంతంగా లాక్కెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టారు. విషయం బయటికి చెబితే తీవ్రమైన పర్యవసానాలు ఉంటాయని దుండగులు బాధితురాలిని భయపెట్టారు. ఫోన్‌ను తిరిగి ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. కాగా విద్యార్థినిని డిన్నర్‌కు బయటికి తీసుకెళ్లిన యువకుడు మధ్యలోనే పరారయ్యాడని



అంటున్నారు. అందుకే అతనిపైనా అనుమానాలు కలుగుతున్నాయి. అత్యాచారంలో ఈ ఫ్రెండ్ పాత్ర తెలియాలంటే పోలీస్ దర్యాప్తు ముమ్మరంగా జరగాలి. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని దుర్గాపూర్, కోల్‌కతా, బెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. జాతీయ మహిళా కమిషన్ బెంగాల్‌లో మహిళలకు సరైన భద్రత కల్పించాలని మమత ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిరుడు ఆగస్టులో ఆర్‌జి కర్ ఆస్పత్రిలో రాత్రిపూట వైద్య విధుల్లో ఉన్న లేడీ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఉదంతం సంచలనమైంది. ఆందోళనలతో బెంగాల్ రాష్ట్రం అట్టుడికింది. అయినా బెంగాల్లో మమతా బెనర్జీ పాలనతీరు మారలేదు. మహిళలకు రక్షణ కల్పించడం లేదు. అంటే మృగాళ్లకు భయం కలగడం లేదు. దీనికితోడు మమత చేసిన వ్యాఖ్యలు మృగాళ్లకు ఊతమిచ్చేలా ఉన్నాయి. ఏం మాట్లాడాలో కూడా తెలియని బాధ్యతారహిత నాయకులు ఉండడం సిగ్గుచేటు. ఆర్‌జికర్ ఆస్పత్రి వ్యవహారంలో అంతా మాయ జరిగింది. అసలు నిందితులను వదిలేసి ఓ అమాయకుడిని అందులో ఇరికించేశారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగానూ నిరసనలు మిన్నంటాయి. ఈ కేసులో సివిక్ పోలీస్ వలంటీర్ సంజరు రారుకి జీవిత ఖైదు పడింది. అసలు నిందితులను వదిలేశారని నేటికీ బాధితురాలి కుటుంబం పోరాడుతూనే ఉంది. ఆర్‌జి కర్ ఘోరాన్ని మరవకముందే దుర్గాపూర్ దారుణం సంభవించింది. ఈ ఏడాది జులైలో దక్షిణ కలకత్తా లా కాలేజీ విద్యార్థినిపై అత్యాచారం జరిగింది. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో కాలేజీ క్యాంపస్‌లలో విద్యార్థినులపై జరుగుతున్న వరుస అత్యాచారాలు విద్యా సంస్థలు, వాటి పరిసరాల్లో భద్రతా చర్యలపై డొల్ల తనాన్ని ప్రశ్నిస్తున్నాయి. పటిష్టమైన భద్రత, నిఘా, అప్రమత్తపు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. బిజెపిని విమర్శిస్తున్న మమతా బెనర్జీ తన ఏలుబడిలో బెంగాల్లో వరుస ఘటనలు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. అత్యాచారం వంటి దారుణాలు జరిగినప్పుడు ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు బాధ్యతగా ఉండాలి. బాధజతులకు న్యాయం జరుగుతుందన్న ఆత్మవిశ్వాసం వారిలో కలిగించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలాలి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కానీకుండా హెచ్చరికలు చేయాలి. మహిళలలో భయం పోగొట్టి భరోసా నింపాలి. ఇటువంటి స్పందనను ఒక మహిళా ముఖ్యమంత్రి నుంచి మహిళలు, ప్రజలు ఆశిస్తారు. కానీ మమత అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం తగనిపని.

# సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం

## సంపన్నులను కలవర పెడుతున్న ధరలు

## లక్షా 30 వేలు దాటేసిన బంగారు తులం ధర

**హైదరాబాద్,అక్టోబర్14:** సామాన్యులను దూరం చేసుకుంటున్న బంగారం సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.30 లక్షలు దాటి పరుగులు పెడుతోంది.మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది.మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది.



2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. అటు వెండి ధర కూడా భారీగా పెరుగుతోంది. దాదాపు రూ.2 లక్షలకు చేరువైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జాతీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4,115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51 డాలర్లు దాటింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సు రద్దు

## • తగ్గు మందు మరణాలతో తమిళనాడు నిర్ణయం



**చెన్నై,అక్టోబర్14:** శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సును తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ శాఖ రద్దు చేసింది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ చేస్తున్న ఆ కంపెనీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు డ్రగ్స్ శాఖ వెల్లడించింది. కోల్డ్రిఫ్ దగ్గుమందులో ప్రాణాంతకమైన డైఇథలీన్ గ్లైకాల్ ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో 21 మంది చిన్నారుల మృతికి కారణమైన ఆ ప్రాణాంతక ఔషధం ఆ దగ్గుమందులో ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు సర్కారు 2011లో శ్రీసన్ ఫార్మసీ కంపెనీకి దగ్గుమందు తయారీకి లైసెన్సు జారీ చేసింది. 2016లో ఆ లైసెన్సుకు రెన్యూవల్ చేశారు. శ్రీసన్ కంపెనీ లైసెన్సు రద్దు చేసి, దాన్ని పూర్తిగా మూసివేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర డ్రగ్ తయారీ కంపెనీలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు శ్రీసన్ ఫార్మసిట్యూకల్స్‌తో పాటు కొందరు డ్రగ్ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టింది. మధ్యప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ శాఖ అక్టోబర్ ఒకటో తేదీన తమిళనాడు అధికారులకు ఆ దగ్గుమందుపై అలర్ట్ జారీ చేసింది. కోల్డ్రిఫ్‌తో పాటు అయిదు రకాల ఉత్పత్తులను చెన్నై ల్యాబ్‌లో పరిశీలించారు. దగ్గు సిరప్‌లో ప్రాణాంతకమైన డీఈజీ ఉన్నట్లు గుర్తించారు. అక్టోబర్ 9వ తేదీన మధ్యప్రదేశ్ పోలీసులు కంపెనీ ఓనర్ రంగనాథన్‌ను అరెస్టు చేశారు. 2023లో సరైన రీతిలో తనిఖీలు నిర్వహించని ఇద్దరు తమిళనాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను కూడా సస్పెండ్ చేశారు.

# మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ



## గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయిన మల్లోజుల

## పార్టీ అనుసరిస్తున్న తీరుపై కొంతకాలంగా అసంతృప్తి

**ముంబై,అక్టోబర్14:** మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన పోలీసులకు లొంగిపోయారు. కొద్దిరోజుల కిందట తన సోదరుడు మల్లోజుల కోటేశ్వరరావుకు కిషన్‌జీ పేరుతో వేణుగోపాల్‌రావు ఒక లేఖ రాశారు. అందులో మావోయిస్టు పార్టీ విధానాలపై వేణుగోపాల్‌రావు కొంతకాలంగా అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడిపించడానికి బహిరంగంగా ప్రజల్లోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదంటూ మావోయిస్టు పార్టీకి ఆయన రాసిన మరో లేఖ కలకలం రేపింది. దాని తర్వాత ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. అనివార్య కారణాలతో పార్టీని వీడుతున్నానని.. ఇకపై పార్టీలో కొనసాగబోనని ప్రకటించారు. ఈ క్రమంలోనే 60 మందితో కలిసి గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు. ఆయన రాసిన లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. నిన్నటి పొరపాట్లను విశ్లేషించుకోవడం ద్వారా నేడు, రేపు వాటిని నివారించడం ఎలాగో మనం నేర్చుకుంటాం. తప్పుల నుంచి గుణపాఠాలు తీసుకోవడం రోగం రాకుండా టీకా తీసుకోవడం వంటిది. విప్లవోద్యమాన్ని కూడా అదే తీరుగా నడిపించగలుగుతాం. ఇది నల్లేరు మీద బండిలా సాగే పని ఎంతమాత్రం కాదు. తీవ్రమైన అధ్యయనం, ఓపికతో, త్యాగాలతో కూడిన విప్లవాచరణ' అని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీకి ఆయన 22 పేజీలతో కూడిన సుదీర్ఘ లేఖను ఈ నెల 6వ తేదీన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీలో తీవ్రమైన అంతర్గత సంక్షోభం ఉన్నదని, ఆయుధ పోరాటాలను తాతాలికంగా విరమించాలని ఆ లేఖలో కోరారు. దశాబ్దాల తరబడి తప్పుడు విధానాలే తీవ్రమైన నష్టాలకు కారణమని, 'సైన్యం తప్ప రహస్య పార్టీ లేదు' అని ఆయన ఖరాకండిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాతాలికంగా సాయుధ పోరాటాన్ని విరమించి, ప్రజల మధ్యకు బహిరంగంగా వెళ్లాలని ఆయన క్యాడర్‌ను కోరారు.పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించిన మౌలికమైన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి సైన్యంతో ఉంటే సాధ్యం కాదని వేణుగోపాల్ స్పష్టం చేశారు. 'విప్లవపార్టీ లేకుండా విప్లవమే లేదు' అనే లెనిన్ సూత్రాన్ని విస్మరించడం వల్ల, మావోయిస్టులకు సైన్యం తప్ప రహస్య పార్టీ లేని స్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతమున్న ఏసీ, డీవీసీ వంటి పార్టీ కమిటీలన్నీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వెంట, సైనిక దుస్తులలో సాయుధులుగా ఉండటం బహిరంగ రహస్యమేనని అన్నారు. వీటిని శత్రువుకు అబేధ్యమైన రహస్య పార్టీ నిర్మాణాలుగా పరిగణించలేమని, ఇదే బలహీనత శత్రువుకు పార్టీని నిర్మూలించేందుకు పూర్తి అవకాశాన్ని ఇచ్చిందని పేరొన్నారు. 2007లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో దండకారణ్యం, బీహార్-జార్ఖండ్‌లలో బేస్ ఏరియాలను నిర్మించే కేంద్ర కర్తవ్యాన్ని చేపట్టడం రెండో వ్యూహాత్మక తప్పిదమని వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ బలాన్ని అతిగా అంచనా వేసి, శత్రువు బలాన్ని తకువ చేసి చూశామన్నారు. 2011 నుండే కిందిస్థాయి కామ్రేడ్స్ ఈ తప్పును సరిదిద్దుకోవాలని కోరినప్పటికీ, సీసీ పట్టించుకోలేదని అన్నారు. ఒక దశాబ్దం పాటు నష్టపోయామని తెలిపారు. ఇప్పటికైనా అమరుల రక్తతర్పణం నుండి గుణపాఠాలను తీసుకుందామని పేర్కొన్నారు. రహస్య, చట్టబద్ధ పోరాటాల మధ్య సమన్వయాన్ని కొనసాగించడంలో సెంట్రల్ కమిటీ పూర్తిగా విఫలమైందని ఇది మూడో తప్పిదమని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. 2006 నూతన అటవీ చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చే భూమి పట్టాలను 'బేస్ ఏరియాలు నిర్మిస్తున్నామనే ధీమాతో' వ్యతిరేకించాం. దండకారణ్యంలోని రైతులకు మన జనతన సరార్‌లే పట్టాలిస్తాయని చెప్పాం, కానీ ఆ పట్టాలకు వ్యవస్థలో గుర్తింపు లేదనే ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను విస్మరించామని తెలిపారు. ప్రజలు తమ జీవితావసరాల కోసం అనివార్యమైన ఆధార్ కార్డులు తెచ్చుకోవడాన్ని కూడా పార్టీ వ్యతిరేకించడం, ప్రజలు దొంగచాటుగా ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి వాటిని పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేరొన్నారు. 'ఇప్పుడు మనకు సానుకూల మార్పు కావాలి. ఉద్యమాన్ని కాపాడుకోవడం, క్యాడర్‌ను రక్షించుకోవడం కావాలి. అనవసర త్యాగాలకు అంతం పలుకుదాం. నూతన పద్ధతులలో పురోగమిద్దాం. అంతిమ విజయం ప్రజలదే' అంటూ మల్లోజుల తన లేఖను ముగించారు. తాను కేంద్ర కమిటీలో 28 ఏండ్లు, పొలిట్ బ్యూరోలో 18 ఏండ్లు సభ్యుడిగా ఉన్నట్టు మల్లోజుల తెలిపారు. ప్రస్తుతం ఉద్యమం ఎదురొంటున్న వైఫల్యాలకు, భారీ నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ, యావత్ పార్టీ క్యాడర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు.

# మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు లేకుండా ఎవరూ ముఖ్యమంత్రి కాలేరు

**కర్ణాటక:** కర్ణాటక రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది నవంబర్ నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి రెండున్నరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సీఎం, మంత్రివర్గ మార్పు ఉండవచ్చంటూ మీడియాలో వరుస కథనాలు వస్తున్న విషయం తెలిసిందే. నవంబర్‌లో ఈ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని సీఎం సిద్ధరామయ్య యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రెండున్నరేళ్లు పూర్తి చేసుకున్న 50 శాతం మంది మంత్రులను తొలగించి, కొత్తవారికి అవకాశం ఇస్తారన్న కథనాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు లేకుండా ఎవరూ ముఖ్యమంత్రి కాలేదని వ్యాఖ్యానించారు. ఇటీవలే కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ఓ వార్తా ఛానెల్‌తో మాట్లాడుతూ.. సీఎం మార్పుకు



హైకమాండ్ అభిప్రాయం సరిపోతుందని శాసనసభ్యుల అభిప్రాయం కాదని చెప్పిన విషయం తెలిసిందే. డీకే వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ 'వీటికి నేను సమాధానం చెప్పను. హైకమాండ్ అంటే హైకమాండ్. హైకమాండ్‌తోపాటూ ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా ముఖ్యమే. మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు లేకుండా ఎవరూ ముఖ్యమంత్రి కాలేరు. దాంతోపాటూ హైకమాండ్ ఆశీస్సులు కూడా అవసరమే' అని చెప్పుకొచ్చారు. అంతేకాదు క్యాబినెట్ సహచరులకు సీఎం ఇటీవలే విందు ఇచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.విందు పార్టీకి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో సంబంధం లేదు. నేను తరచుగా విందులు నిర్వహిస్తుంటాను' అని అన్నారు. ఇది ఒక సాధారణ సమావేశం అని ఆయన స్పష్టంచేశారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

# ఐపీఎస్ అధికారి ఆత్మహత్యపై నిష్పాక్షిక విచారణ జరపాలి

**చండీగఢ్:** హరియాణా సీనియర్ ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేసారు. పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను రాహుల్ గాంధీ మంగళవారంనాడిక్కడ కలుసుకుని వారిని ఓదార్చారు. పూరన్ కుమార్ తన నివాసంలో తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర సంచలనమైంది. బ్యూరోక్రసీ, పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష ఉందనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి.పూరన్ కుమార్ కుటుంబ సభ్యులను కలుసుకున్న అనంతరం మీడియాతో రాహుల్ మాట్లాడుతూ, ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులు ఎంత విజయం సాధించినా అణిచివేత తప్పదనే తప్పుడు సంకేతాలు వెళ్లేలా చేస్తుందని అన్నారు. ఆయన ఆత్మహత్యపై తక్షణం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ,



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి కుటుంబానికి సంబంధించినదని కాదని, కోట్లాది దళితుల ఆత్మ గౌరవానికి సంబంధించినదని అన్నారు. తండ్రిని కోల్పోయిన పూరన్‌కుమార్ పిల్లలు ఇద్దరూ చాలా ఒత్తిడిలో ఉన్నారని, చాలాకాలంగా ఐపీఎస్ అధికారిపై వివక్ష కొనసాగించినట్టు తెలుస్తోందని రాహుల్ అన్నారు.పూరన్ కుమార్ అక్టోబర్ 7న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎనిమిది పేజీల సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియాతో సహా పలువురు పేర్లు ఆయన ప్రస్తావించారు. కుల వివక్ష, మానసిక వేధింపులు, పబ్లిక్‌లో అవమానించడం వంటి చర్యలకు వీరు పాల్పడ్డారని ఆరోపించారు.

# లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత

**ఛత్తీస్‌గఢ్, అక్టోబర్ 14:** ఆపరేషన్ కగార్ లక్ష్యంగా భద్రతా బలగాలు ఛత్తీస్‌గఢ్‌లో దూసుకు పోతున్నాయి. అందులో భాగంగా కర్రేగుట్ట అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఆ క్రమంలో మావోయిస్టులు దాచి ఉంచిన పేలుడు పదార్థాలను భారీగా భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నారు. 51 లైవ్ బిజిఎల్.. 100హెచ్డీ అల్యూమినియం వైర్ కట్టలు, 50పైపులతోపాటు భారీగా ఇతర పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.సీఆర్పీఎఫ్ 229,153,196, తడ్పల బేస్ క్యాంపు నుండి కోబ్రా 206 సంయుక్తంగా ఈ కూంబింగ్‌లో పాల్గొన్నాయి. అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిరంతరాయంగా సోదాలు నిర్వహిస్తూ.. మావోయిస్టులు దాచిపెట్టిన పెద్ద మొత్తంలో పేలుడు పదార్థాలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.మరో వైపు మావోయిస్టు అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోను పోలీసుల ఎదుట లొంగిపోయారు. దాదాపు 60 మంది మావోయిస్టులతో కలిసి మంగళవారం మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా పోలీస్



ఉన్నతాధికారులు ఎదుట ఆయన లొంగిపో యారు. మావోయిస్టు పార్టీ విధానాలపై అసంతృ ప్తి వ్యక్తం చేస్తూ ఇటీవల మల్లోజుల లేఖ విడుదల చేసిన విషయం విదితమే.2026, మార్చి నెలాఖరు నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించడమే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మకం గా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా దేశంలో మావోయిస్టులను దాదాపుగా నిర్మూలిం చింది. అలాగే ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యాన్ని సైతం భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.ఇప్పటికే భద్రత బలగాల చేతిలో వందలాది మంది మావోయిస్టులు మరణించగా.. పలువురిని అరెస్ట్ చేశారు. ఇక మృతి చెందిన మావోయిస్టుల జాబితాలో ఆ పార్టీ అగ్రనేతలు సైతం ఉన్న సంగతి తెలిసిందే. మంగళవారం మావోయిస్టు అగ్రనేత లొంగిపోయిన కొద్దిసేపటికే వారు నిల్వ ఉంచి ఆయుధాలను సైతం భద్రతా బలగాలు భారీ ఎత్తున స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

# కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్


**ఛండీగఢ్, అక్టోబర్ 14:** హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ప్రస్తుతం హర్యానా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఏండీగా ఓం ప్రకాశ్ సింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు రాష్ట్ర డీజీపీగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు హర్యానా ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతాధికారులు కుల వివక్ష, అవమానాలు, వేధింపులు తట్టుకో లేక హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే.ఆయన. తన సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్తక్ ఎస్పీ బిజార్ణియా సహా 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు రాశారు. వారి వేధింపులే తన ఈ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నుంచే కాకుండా.. పూరన్ కుమార్ కుటుంబం నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. దాంతో రోహ్తక్ ఎస్పీ బిజార్ణియాపై ప్రభుత్వం ఇప్పటికే బదిలీ వేటు వేసింది. అలాగే డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను సెలవుపై



ప్రభుత్వం పంపించింది. దీంతో కొత్త డీజీపీగా తాత్కాలిక నియామకం అనివార్యమైంది.మరో వైపు అక్టోబర్ 7వ తేదీన ఆత్మహత్య చేసుకున్న పూరన్ కుమార్ కుటుంబం.. తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రముఖ రాజకీయ పార్టీల అధినేతలతో వరుస భేటీ అవుతుంది. ఈ ఆత్మహత్య కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని.. అలాగే పూరన్ కుమార్ మరణించే ముందు పేర్కొన్న ఉన్నతాధికారులను కఠినంగా శిక్షించాలని ఆ కుటుంబం కోరుతుంది. ఆ క్రమంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సైతం హర్యానాలోనఈ కుటుంబం మంగళవారం పరామర్శించను న్నారు.పూరన్ కుమార్ భార్య అమ్నేతి కుమార్.. అదే రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్ సమయంలో.. హర్యానా ముఖ్యమంత్రి నయిబ్ సింగ్ సైనీ సారథ్యంలోని ఉన్నతాధికారి బృందం విదేశాల్లో పర్యటిస్తుంది. పూరన్ కుమార్ తెలుగు రాష్ట్రానికి చెందిన వారు.

# బిహార్ అసెంబ్లీ ఎలక్షన్స్ - 71 మందితో తొలి జాబితా విడుదల చేసిన బీజేపీ


**బిహార్ :**బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ మంగళవారం 71 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. ఇందులో ఉపముఖ్యమంత్రులు, మంత్రులు స్థాయి కీలక నేతల పేర్లు కూడా ఉన్నాయి.బిజేపీ విడుదల చేసిన జాబితా ప్రకారం, బిహార్ ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తారాపూర్ నుంచి, మరో డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా లఖిసరాయ్ స్థానాల నుంచి పోటీ చేస్తున్నారు. ఇక మాజీ ఉపముఖ్యమంత్రి తార్కిషోర్ ప్రసాద్- కతిహార్ స్థానం నుంచి బరిలోకి దిగుతున్నారు.ఇక రాష్ట్ర మంత్రుల విషయానికి వస్తే, రేణు దేవి- బెట్టియా, నితీశ్ మిశ్రా- జంజర్పూర్, మంగళ్ పాండే- సివాన్, , నితిన్ నబీన్ బంకీపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. శ్రేయస్ సింగ్- జముయ్‌స్థానంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారుదూకుడు మీదున్న ఎన్‌డీఏఅతి త్వరలో బిహార్? అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా, విపక్ష పార్టీల్లో సీట్ల కేటాయింపుపై ఇంకా తర్జనభర్జనలు జరుగుతున్నాయి. కానీ అధికార ఎన్?డీఏ కూటమి మాత్రం మంచి దూకుడు మీద ఉంది. ఇప్పటికే కూటమి పార్టీల మధ్య (243) సీట్ల పంపకంపై ఒప్పందం కుదిరింది.సీట్ల పంపకం ప్రకారం, బిహార్‌రాష్ట్రంలో బీజేపీ- 101 స్థానాలు, ముఖ్యమంత్రి నితీశ్? కుమార్ నేతృత్వంలోని జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ)- 101 సీట్లు, కేంద్రమంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి



పార్టీ (రామ్ విలాస్)- 29 సీట్లు, కేంద్ర మంత్రి జీతన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తానీ అవామ్ మోర్చా (హెచ్‌ఏఎం)- 6 సీట్లు, కేంద్ర మాజీ మంత్రి ఉపేంద్ర కుశ్వాహా సారథ్యంలోని రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్‌ఎల్‌ఎం)- 6 సీట్లలో పోటీ చేయనున్నాయి.విపక్షాల పరిస్థితి ఏంటిమరోవైపు మహాగట్బంధన్‌లో సీట్ల పంపకం ఇంకా పూర్తి కాలేదు. కాంగ్రెస్ 70 సీట్లు అడుగుతుంటే, విపక్ష కూటమి పార్టీలు, ముఖ్యంగా ఆర్‌జేడీ మాత్రం ఈసారి కాంగ్రెస్‌కు కేవలం 19 సీట్లు మాత్రమే కేటాయించడానికి మొగ్గు చూపుతోందని సమాచారం. మరోవైపు ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవ్‌ను కాంగ్రెస్ సీఎం అభ్యర్థిగా అంగీకరిస్తుందో, లేదో ఇంకా తెలియరాలేదు. దీనికి తోడు ఆర్జేడీ చీఫ్? లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ పక్కలో బల్లెంలా తయారయ్యాడు. ఇక చిన్నచిన్న పార్టీలైన ముకేశ్ సాహ్నికి చెందిన వికాశ్ షీల్ ఇన్సాన్ పార్టీ (వీపీఐ), సీపీఐ (ఎంఎల్) కూడా ఈసారి ఎక్కువ సీట్ల కోసం గట్టిగా బేరసారాలు ఆడుతున్నాయి. ఇది విపక్ష కూటమికి కాస్త ఇబ్బంది కలిగించే అంశమే అని చెప్పుకోవచ్చు.ప్రశాంత్ కిశోర్ పరిస్థితి ఏమిటి?బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక ప్రకటన చేశారు. ఆరు సంవత్సరాల క్రితం అమేఠీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అవమానకరమైన ఓటమిని చవిచూసినట్లే, రాబోయే బిహార్ ఎన్నికల్లో ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఓడిపోతారని జోస్యం చెప్పారు. కొద్ది రోజుల క్రితం జన్ సురాజ్ పార్టీ 51 మంది అభ్యర్థులతో విడుదల చేసిన మొదటి జాబితాపై, చాలా మంది ఆశావహులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిని ప్రశాంత్ కిశోర్ చాలా తేలికగా తీసుకున్నారు. ఇవన్నీ సహజమే అని ఆయన అన్నారు. కానీ ఆయన కూడా ఈ ఎన్నికలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది బిహార్? అసెంబ్లీ ఎన్నికలు రెండు దశల్లో నవంబర్? 6, 11 తేదీల్లో జరగనున్నాయి.

# అందుకు ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందే బీహార్ రాజకీయ పార్టీలకు ఈసీ ఆదేశం

**బీహార్ :** అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ అక్కడి రాజకీయ పార్టీలకు కీలక ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు మంగళవారం అన్ని పార్టీలకు మార్గదర్శకాలు ఇచ్చింది.అభ్యర్థులు సోషల్ మీడియాతో సహా ఎలక్ట్రానిక్ లేదా




డిజి టల్ ప్లాట్‌ఫామ్‌లలో ఏదైనా రాజకీయ ప్రకటనలను ప్రచురించడానికి లేదా ప్రసారం చేయడానికి ముందు మీడియా సర్టిఫికేషన్ తీసుకోవడం, మానిటరింగ్ కమిటీ నుంచి ముందస్తు ధ్రువీకరణ పత్రం పొందడాన్ని ఈసీ తప్పనిసరి చేసింది. రాజకీయ ప్రచారాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు ఈసీ అధికారులు పేర్కొన్నారు.రాజకీయ ప్రకటనల కోసం ముందస్తు ధ్రువీకరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలను ఏర్పాటుచేసినట్లు వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన రాజకీయ పార్టీలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం.. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 75 రోజులలోపు ప్రచార ఖర్చుల పూర్తి వివరాలను రాజకీయ పార్టీలు సమర్పించాలని ఈసీ సూచించింది.

# హరియాణా అధికారి కేసు డీజీపీని సెలవుపై పంపిన ప్రభుత్వం

**హర్యానా:** సీనియర్ ఐపీఎస్ అధికారి వై.పూరన్ కుమార్(52) ఆత్మహత్యకు కారణమయ్యారని ఆరోపణలున్న హరియాణా డీజీపీని ఆ పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్ర రూపం దాల్చుతో ంది. డీజీపీపై చర్యలు తీసుకోవాలంటూ ప్రతిపక్షాలు, దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ క్రమంలో హరియాణా ప్రభుత్వం డీజీపీ శత్రుజీత్ కపూర్‌పై చర్యలు తీసుకుంది. డీజీపీని సెలవుపై పంపించింది.ఈ కేసుకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొం



టున్న రోహ్తక్ ఎస్పీ నరేంద్ర బిజర్ని యాను ఇప్పటికే ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ క్రమంలోనే డీజీపీ శత్రుజీత్ కపూర్‌పై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. 48 గంటల్లోగా డీజీపీని పదవి నుంచి తొలగించాలని దళిత సంఘాలు ఆందోళనలు చేశాయి. తమ డిమార్‌ను నెరవేర్చకపోతే హరియాణా, చండీగఢ్ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 5లక్షల వాల్మీకి సమాజానికి చెంది న ఉద్యోగులు రాజీనామా చేస్తారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే డీజీపీ శత్రుజీత్?ను సెలవుపై పంపించామని హరియణా ముఖ్యమంత్రి మీడియా సలహాదారు రాజీవ్ జైట్లీ తెలిపారు.ల్యాప్‌టాప్ కోసం అమ్నీత్ కుమార్‌కు నోటీసులుఇదిలా ఉండగా పూరన్ కుమార్ భార్య అమ్నీత్ పి కుమార్‌కు చండీగఢ్ పోలీసులు నోటీసు జారీ చేశారు. విచారణలో భాగంగా పూరన్ కుమార్‌కు చెందిన ల్యాప్‌టాప్‌ను సమర్పించాలని నోటీసులో తెలిపారు. ఆ ల్యాప్?టాప్?ను డిజిటల్ పరీక్ష కోసం ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరికి పంపాలని నిర్ణయించినట్లు పోలీసులు వర్గాలు తెలిపాయి. అందులో కీలకమైన సమాచారం, అలాగే సూసైడ్‌నోట్ అసలు డ్రాఫ్ట్ ఉండొచ్చవని భావిస్తోన్నట్లు పేర్కొన్నాయి. సూసైడ్ నోట్ స్వయంగా పూరన్ రాశారా లేక ఆయన ల్యాప్‌టాప్‌లోనే రూపొందిం చారా అనే విషయాలను నిర్ధారించాలని తెలిపాయి. పూరన్ తన మరణానికి ముందు ఈమెయిల్ ద్వారా పంపినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ నోట్ ఎవరెవరికి, ఎప్పుడు పంపారు అనే అంశాలను కూడా సమగ్రంగా పరిశీలిస్తోంది.పూరన్ కుమార్? బలవన్మరణానికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో డీజీపీ శత్రుజీత్, రోహ్తక్ ఎస్పీ నరేంద్ర పేర్లను చేర్చాలంటూ ఆయన భార్య సీనియర్ ఐఏఎస్ అధికారిణి అమ్నీత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన బలవన్మరణానికి ఉన్నతాధికారుల వేధింపులే కారణమని, వారిపై చర్యలు హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి అమ్నీత్ ఇప్పటికే లేఖ రాశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైనీ, దోషులు ఏ స్థాయివారైనా వదిలిపెట్టేది లేదని స్పష్టంచేశారు.


# కదులుతున్న బస్సులో మంటలు 15 మంది సజీవదహనం



**జైసల్మేర్:** రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో మంగళవారంనాడు ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. థైయాట్ ప్రాంతంలోని మిలటరీ స్టేషన్ సమీపంలో కదుపుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి 15 మంది సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయపడ్డారు. బస్సులోంచి దట్టమైన పొగలు రావడంతో డ్రైవరు వెంటనే బస్సులు నిలిపివేశారు. నేషనల్ హైవేపై బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో కిలోమీటర్ల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని అర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంటలు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు.

# చైనాను వణికించిన భూకంపం

**చైనా :** చైనాలో భారీ భూకంపం సంభవించింది. షింజియాంగ్ లో మంగళవారం భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.2గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి పది కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలతో భవనాలు ఊగిపోయాయి. ప్రజలు భయంతో ఇండ్ల నుంచి బయటకి పరుగులు



తీశారు. అయితే, ఈ విపత్తులో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు.కాగా, గత వారం సిచువాన్ ప్రావిన్స్‌లోని జిన్‌లాంగ్ కౌంటీలో భూమి కంపించిన విషయం తెలిసిందే. భూకంపం తీవ్రత రిక్టరు స్కేలుపై 5.4గా నమోదైనట్లు చైనా భూకంప కేంద్రం తెలిపింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు వెల్లడించింది. ఈ భూకంపం ధాటికి పొరుగున ఉన్న భూటాన్ లోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అక్కడ భూకంపం తీవ్రత 3.1గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఈ భూకంపం ధాటికి ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే, ఈ ఘటనలో ధాటికి ప్రాణ నష్టానికి సంబంధించి ఎలాంటి సమాచారం లేదు.

# విండీస్‌తో రెండో టెస్టులో సిరాజ్ అరుదైన ఫీట్



హైదరాబాదీ ఏస్ పేసర్ మహ్మద్ సిరాజ్ టెస్టుల్లో అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. ఈ ఏడాది అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ గా నిలిచాడు. సోమవారం నాలుగో రోజు వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ వికెట్ ను తీసిన అనంతరం ఈ ఏడాది లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఓవరాల్ గా ఈ ఏడాది 8 మ్యాచ్ లు ఆడిన సిరాజ్.. 1575 బంతులు వేశాడు. రఫ్ గా చెప్పాలంటే 262.3 ఓవర్లను నిలకడగా బౌలింగ్ చేశాడు. మొత్తంమీద 37 వికెట్లను తీశాడు. అతని సగటు 26.91 కావడం విశేషం. ఓవరాల్ గా తను ఈ ఏడాది టెస్టుల్లో 39 మెయిడిన్లు వేశాడు. అలాగే 996 పరుగులను సమర్పించుకున్నాడు. తన అత్యుత్తమ వ్యక్తిగత ప్రదర్శన 6-70 కావడం విశేషం. ఇక 42.56 స్ట్రైక్ రేట్ తో 3.79 ఎకానమీ రేటుతో తను బౌలింగ్ చేశాడు. ఓవరాల్ గా తన ఖాతాలో రెండు నాలుగు వికెట్ల ప్రదర్శన, రెండు ఐదు వికెట్ల ప్రదర్శన ఉన్నాయి. వెస్టిండీస్ తో రెండో టెస్టు కుముందు 36 వికెట్లతో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజరబానీ నెంబర్ వన్ స్థానంలో ఉన్నాడు. తను ఈ ఏడాది 9 మ్యాచ్ లు ఆడి, 276.4 ఓవర్లు వేశాడు. సగటు 28.63 కాగా, 47 మెయిడిన్లను వేశాడు. ఇక వెస్టిండీస్ తో జరుగుతున్న రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. ఫాలో ఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్ ను కొనసాగించిన వెస్టిండీస్ సోమవారం నాలుగో రోజు 118.5 ఓవర్లలో 390 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో భారత్ ముందు 121 పరుగుల టార్గెట్ ను నిర్దేశించింది. ఇక ఈ మ్యాచ్ లో నాలుగో రోజు బ్యాటింగ్ చేసి, ఓపెనర్ జాన్ క్యాంబెల్ (199 బంతుల్లో 115, 12 ఫోర్లు, 3 సిక్సర్లు), షాయ్ హోప్ (214 బంతుల్లో 103, 12 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీలతో సత్తా చాటారు. మూడో వికెట్ కు వీరిద్దరూ కలిసి 177 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. దీంతో టీమిండియా ముందు 100ం రన్స్ టార్గెట్ ఉంచగలిగింది. బౌలర్లలో కుల్దీప్ యాదవ్, జస్ ప్రీత్ బుమ్రాకు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ ప్రారంభించిన భారత్.. ఆటముగిసేసరికి 18 ఓవర్లలో వికెట్ నష్టానికి 63 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో యశస్వి జైస్వాల్ (8) త్వరగా ఔటవగా, మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ (25 బ్యాటింగ్), వన్ డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ (30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంకా విజయానికి భారత్ కు 58 పరుగులు కావాలి. తొలి టెస్టును ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన భారత్.. రెండు టెస్టుల సిరీస్ లో 1-0తో ఆధిక్యంలో ఉంది. మ్యాచ్ కు మంగళవారం ఆఖరిరోజు. దాదాపు లంచ్ విరామం లోపలే ఈ మ్యాచ్ ఫలితం తేలే అవకాశం ఉంది. ఇక తొలి ఇన్నింగ్స్ ను భారత్ 5 వికెట్లకు 518 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. జైస్వాల్ (175) టాప్ స్కోరర్ గా నిలిచాడు. మరోవైపు తమ తొలి ఇన్నింగ్స్ లో విండీస్ 248 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 270 పరుగుల లీడ్ ఇండియాకు దక్కింది.

# రెండో టెస్టులో భారత్ ఘన విజయం

**7 వికెట్ల తేడాతో వెస్టిండీస్ పై విక్టరీ**

**గిల్ కెప్టెన్సీలో 2-0తో తొలి సిరీస్ సొంతం**



శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా తొలి టెస్ట్ సిరీస్ నెగ్గింది. ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత, పర్యాటక జట్టు విండీస్‌ను ఫాలో-ఆన్ ఆడించింది. తొలి టెస్టులో ఎదురైన సీన్ దాదాపు రిపీట్ అయింది. అయితే, వెస్టిండీస్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్ లో తమ పోరాటాన్ని చూపారు. ఈసారి చాలా ధైర్యంగా, నిలకడగా భారత బౌలర్లను ఎదుర్కొన్న తీరు అమోఘం. అయితే భారత్ ఛేదించడానికి 121 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఇచ్చింది విండీస్ జట్టు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలినా, భారత్ సునాయాసంగా విజయం సాధించింది.కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. కీలక సమయాల్లో నిలకడగా బ్యాటింగ్ చేశాడు. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ (100 పరుగులు) సాధించాడు. ఇప్పుడు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన స్కోర్‌ను ఛేజింగ్ చేసే క్రమంలో హాఫ్ సెంచరీ చేశాడు. 58 పరుగులతో మ్యాచ్ ముగించాడు. నిన్న మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ త్వరగా అవుట్ అయిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దాడు. తాజా ఇన్నింగ్స్ తో టెస్ట్ ఫార్మాట్‌లో రాహుల్ ఖాతాలో 20 అర్ధ సెంచరీలు, 11 సెంచరీలు ఉన్నాయి.



సాయి సుదర్శన్ 76 బంతుల్లో 39 పరుగులు చేసి ఔటయ్యాడు. రెండో టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లోనూ 87 పరుగులతో రాణించాడు. ఫీల్డింగ్ లోనూ మెరిశాడు. మొదటి టెస్ట్‌లో 50 పరుగులు, ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో 129 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ 4వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి కేవలం 13 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్ విజయానికి కావాల్సిన పరుగులు చేశారు.విండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమిండియా ఎపెనర్ యశస్వి జైస్వాల్ 219 పరుగులతో సిరీస్‌ను టాప్ స్కోరర్‌గా ముగించాడు. రెండో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో అతను చేసిన 175 పరుగులు సిరీస్ లో అత్యుత్తమ స్కోరు. జైస్వాల్ తర్వాత కేఎల్ రాహుల్ (196 పరుగులు), శుభ్‌మన్ గిల్ (192) ఉన్నారు. వికెట్లలోనూ భారత బౌలర్లు ఆధిపత్యం చెలాయించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్, చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ 12 వికెట్లతో అగ్ర స్థానంలో నిలవగా, ఆ తర్వాత స్థానాల్లో ఉన్న మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా వరుసగా 10, 8 వికెట్లు తీశారు. భారత్ తొలి ఇన్నింగ్స్ 518/5 వద్ద డిక్లేర్ జైస్వాల్ (175), శుభ్‌మన్ గిల్ (129 నాటౌట్), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) రాణించారు. కుల్దీప్ యాదవ్ (5/82), జడేజా (3/46) భారత్ రెండో ఇన్నింగ్స్ 124/3 వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ : 248 ఆలౌట్ రెండో ఇన్నింగ్స్: 390 ఆలౌట్ కాంప్‌బెల్ (115), షై హోప్ (103), జస్టి

## ఎంఎస్ ధోని సంప్రదాయాన్ని గిల్ బ్రేక్ చేశాడా



భారత క్రికెట్ జట్టు వెస్టిండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను గెలిచి అద్భుత ప్రదర్శన చేసింది, అయితే ఈ విజయంతో పాటు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ధోనీ సంప్రదాయాన్ని బ్రేక్ చేయడం కూడా చర్చనీయాంశమైంది. భారత మాజీ కెప్టెన్ ధోనీ ఒక సంప్రదాయాన్ని ప్రారంభించాడు, అదేమిటంటే, టీమ్ ఇండియా సిరీస్‌ను గెలిచినప్పుడల్లా, ట్రోఫీని జట్టులోని కొత్త ఆటగాడికి అందజేస్తారు. దీని ఉద్దేశ్యం ఏమిటంటే జట్టులో ఐక్యతను పెంపొందించడం, కొత్త ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడం. వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్‌ను గెలిచిన తర్వాత,టీమ్ ఇండియా విజయోత్సవ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీడియోలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్బ్సి స్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా నుంచి ట్రోఫీని తీసుకుని, దానిని వైస్ కెప్టెన్ రవీంద్ర జడేజాకు అందజేసినట్లు కనిపించింది. ఇది చూసిన అభిమానులు ఆశ్చర్యపోయారు, ఎందుకంటే ధోనీ కాలం నుంచి వస్తున్నట్లుగానే ఈ ట్రోఫీని కొత్త ఆటగాడికి అందజేస్తారని అందరూ భావించారు. సోషల్ మీడియాలో అభిమానులు గిల్ ధోనీ సంప్రదాయాన్ని ముగించాడా, ఇది జట్టు సంస్కృతేనా అని ప్రశ్నలు లేవనెత్తారు.

## బాబర్ అజామ్ ఘోరంగా విఫలం



బాబర్ అజామ్ కష్టకాలం ఇప్పుడిప్పుడే ముగిసేలా లేదు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ ఘోరంగా విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 23 పరుగులకే ఔటయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోవడం గమనార్హం. రెండో ఇన్నింగ్స్‌లో బాబర్ అజామ్ 72 బంతులు ఆడి, 42 పరుగులు చేశాడు. కానీ, ఆ తర్వాత కగిసో రబాడ చేతిలో ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోతున్న బాబర్ అజామ్ తీరు చూసి పాక్ జట్టు ఆందోళనకరంగా ఉంది.టెస్ట్ సెంచరీ కోసం బాబర్ ఆజం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 74 ఇన్నింగ్స్‌లలో ఒక్క టెస్ట్ సెంచరీ కూడా చేయలేదు. 2023 నుంచి అతని బ్యాటింగ్ సగటు కేవలం 23.75 మాత్రమే. బాబర్ ఆజంకు ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, అతని చివరి 28 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో, అతను కేవలం రెండు అర్ధ సెంచరీలు మాత్రమే సాధించాడు. అతను ప్రతిసారీ మంచి ఆరంభాలను పొందినప్పటికీ, వాటిని పెద్ద స్కోర్‌లుగా మార్చలేకపోతున్నాడు. అతని చివరి 15 ఇన్నింగ్స్‌లలో ఉత్తమ స్కోరు 42గా ఉంది.లాహోర్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో బాబర్ అజామ్ స్ట్రెయిట్ డెలివరీలతో అవుట్ అయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను LBWగా అవుట్ అయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో, ఆఫ్-బ్రేక్ బౌలర్ సైమన్ హార్మర్ అతన్ని LBWగా అవుట్ చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో, రబాడ యాంగిల్ చేసిన డెలివరీ అతన్ని స్టంప్‌ల మధ్య క్యాచ్ చేసింది. బాబర్ ఇన్‌కమింగ్ డెలివరీలతో ఇబ్బంది పడుతున్నాడని స్పష్టంగా తెలుస్తుంది. ఇది సాంకేతిక లోపం వల్ల కావొచ్చు. బాబర్ త్వరలో భారీ టెస్ట్ ఇన్నింగ్స్ ఆడకపోతే, అతను టీ20లలో ఎదుర్కొన్న పరిస్థితినే ఎదుర్కొవాల్సి ఉంటుంది.

# యశస్వి ఓపెనింగ్ చేస్తే రోహిత్‌ను మర్చిపోతారు

- **మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా సంచలన వ్యాఖ్యలు**




టీమ్‌ఇండియాలో ఇప్పుడు యువ శక్తి మొదలైనట్లు కనిపిస్తోంది. లెజెండరీ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు యంగ్ ప్లేయర్స్ మధ్య తీవ్రమైన పోటీ నడుస్తోంది. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో యంగ్ లెఫ్ట్ హ్యాండర్ అదరగొట్టే ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకుని, రోహిత్ శర్మకు అసలైన వారసుడు అతడేనని అందరితోనూ అనిపించుకు న్నాడు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతడికి ఇంకా సమయం పడుతుందని పక్కనపెట్టారు. సరిగ్గా ఇదే టైమ్‌లో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఒకరు సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చి, అసలు సిసలైన వారసుడు అతడు కాదు, మరొకడు ఉన్నాడని చెప్పి పెద్ద ట్విస్ట్ ఇచ్చాడు. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో తన ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన యంగ్ ప్లేయర్ అభిషేక్ శర్మ, రోహిత్ శర్మ స్థానానికి సరైనోడని చాలా మంది భావించారు. ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన సిరీస్‌కు కూడా అతడిని వెంటనే ఎంపిక చేయడంతో, ఆస్ట్రేలియాతో జరగనున్న మెయిన్ సిరీస్‌లో కూడా చోటు ఖాయమని ఊహాగానాలు మొదలయ్యాయి. 2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, బీసీసీఐ రోహిత్ స్థానంలో అభిషేక్‌ను సిద్ధం చేస్తోందని అందరూ అనుకున్నారు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతన్ని ఇంకా వెయిటింగ్ లిస్ట్‌లోనే ఉంచి అందరికీ షాక్ ఇచ్చారు. అభిషేక్ తన అవకాశం కోసం మరికొంత కాలం వేచి చూడక తప్పదని స్పష్టం చేశారు.

అభిషేక్ శర్మ గురించి చర్చ జరుగుతున్న సమయంలో టీమ్‌ఇండియాలో మాజీ ఓపెనర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ఒక కొత్త వాదనను తెరపైకి తెచ్చాడు. వన్డేల్లో రోహిత్ శర్మ తర్వాత ఓపెనింగ్ స్లాట్‌కు అభిషేక్ శర్మ కంటే ముందు యశస్వి జైస్వాల్ రేసులో ఉన్నాడని స్పష్టం చేశాడు. ఇప్పటికే టెస్ట్ క్రికెట్‌లో ఓపెనర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న యశస్వి, త్వరలోనే అన్ని ఫార్మాట్లలో రెగ్యులర్ ప్లేయర్ అవుతాడని జోస్యం చెప్పాడు. "అభిషేక్ శర్మ గురించి చాలా చర్చ జరుగుతోంది, కానీ నా అభిప్రాయం ప్రకారం యశస్వికే మొదట అవకాశం ఇవ్వాలి. అతడిని ఎక్కువ కాలం పక్కన పెట్టలేరు" అని ఆకాశ్ చోప్రా గట్టిగా చెప్పాడు.ఆకాశ్ చోప్రా అంతటితో ఆగకుండా, ఒక సంచలన కామెంట్ చేశాడు. ఒకవేళ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ కలిసి వన్డేల్లో ఓపెనింగ్ చేయడం మొదలు పెడితే, వాళ్లిద్దరి దూకుడు ముందు ప్రేక్షకులు రోహిత్ శర్మను కూడా మిస్ అవ్వకపోవచ్చని అన్నాడు. "గిల్ ఇప్పటికే కెప్టెన్సీ బాధ్యతలతో ముందుకు వెళ్తున్నాడు. అతడితో పాటు యశస్వి ఓపెనింగ్ చేస్తే, ఆ కాంబినేషన్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అప్పుడు బహుశా రోహిత్ లేని లోటు కూడా ఎవరికీ తెలియక పోవచ్చు" అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో విశ్లేషించాడు. ఇది రోహిత్ ఫ్యాన్స్‌కు అంతగా నచ్చకపోయినా, టీమ్‌ఇండియాలో ఫ్యూచర్ ప్లాన్స్‌కు అద్దం పడుతోంది.ఆకాశ్ చోప్రా కేవలం వన్డేల గురించే కాదు, టీ20 ఫార్మాట్ గురించి కూడా తన అంచనాలను పంచుకున్నాడు. 2026 టీ20 వరల్డ్ కప్ తర్వాత, టీమ్‌ఇం డియాలో టీ20 ఓపెనింగ్ స్లాట్‌లో పెద్ద మార్పులు జరగవచ్చని అన్నాడు.

# వ్యూస్ కోసమే హర్షిత్ రాణాపై విమర్శలు

## క్రిష్ శ్రీకాంత్‌పై గౌతమ్ గంభీర్ ఆగ్రహం

టీమిండియా మాజీ క్రికెటర్ క్రిష్ శ్రీకాంత్‌పై గౌతమ్ గంభీర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. యూట్యూబ్ వ్యూస్ కోసం యువ క్రికెటర్ అయిన హర్షిత్ రాణాపై విమర్శలు గుప్పిస్తారా అని మండిపడ్డాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసిన వన్డే, టీ20 జట్లలో హర్షిత్ రాణాకు చోటు దక్కడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమైన సంగతి తెలిసిందే.గౌతమ్ గంభీర్‌కు ప్రియ శిష్యుడు కావడంతోనే హర్షిత్ రాణాకు మూడు ఫార్మాట్లలో అవకాశాలు దక్కుతున్నాయని క్రిష్ శ్రీకాంత్‌తో పాటు పలువురు నెటిజన్లు ఆరోపించారు. మూడు ఫార్మాట్లలో ఆడే ప్రతిభ హర్షిత్ రాణాకు లేదని అభిప్రాయపడ్డారు. వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్ అనంతరం గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా హర్షిత్ రాణాపై వచ్చిన విమర్శలను గంభీర్ ముందు ప్రస్తావించగా ఘాటు వ్యాఖ్యలు చేశాడు.'యూట్యూబ్ వ్యూస్ కోసం 23 ఏళ్ల ఆటగాడిని విమర్శించేందుకు సిగ్గుండాలి. ఇలా మాట్లాడటం అన్యాయం. హర్షిత్ రాణా తండ్రి మాజీ చీఫ్ సెలెక్టర్ కాదు. మాజీ క్రికెటర్ కూడా కాదు. చివరకు ఎన్ఆర్ఐ కూడా కాదు. అతను ఎవరి మద్దతు లేకుండా తన సొంత ప్రతిభతో క్రికెట్ ఆడుతున్నాడు. అవకాశం వచ్చినప్పుడల్లా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. ఆటగాళ్లను వ్యక్తిగతంగా లక్ష్యం చేస్తూ మాట్లాడటం సరికాదు. వారి ప్రదర్శన గురించి మాట్లాడండి. ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించేందుకు సెలెక్టర్లు ఉన్నారు. సోషల్ మీడియా వేదికగా ఓ 23 ఏళ్ల యువకుడిపై ఘాటైన విమర్శలు చేస్తే.. అతని మానసిక స్థితి ఏం కావాలిభవిష్యత్తులో మీ పిల్లలు క్రికెట్ ఆడి.. వారు వ్యక్తిగత దూషణకు గురైతే ఈ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి. అతను 23 ఏళ్ల కుర్రాడు. అతనిది 33 ఏళ్ల వయసు కాదు. హెడ్ కోచ్‌గా నన్ను విమర్శించండి. నేను భరించగలను. కానీ 23 ఏళ్ల కుర్రాడిపై అనవసర విమర్శలు చేయ డం భావ్యం కాదు. భారత క్రికెట్ పట్ల నైతిక బాధ్యత ఉండాలి. మీ యూట్యూబ్ ఛానెల్ వ్యూస్ కోసం ఇలాంటి విమర్శలు చేయ కూడదు.



## 'రాజా సాబ్' పోస్టర్ డ్రెస్‌తో మాళవిక సందడి!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్ థ్రిల్లర్ 'ది రాజా సాబ్' సినిమా చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ప్రస్తుతం చిత్ర యూనిట్ గ్రీస్‌లో మిగిలి ఉన్న రెండు పాటల చిత్రీకరణలో బిజీగా ఉంది. ఈ సందర్భంగా సినిమా హీరోయిన్లలో ఒకరైన మాళవిక మోహనన్, తన ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ ఖాతాల్లో పోస్ట్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గ్రీస్‌లోని అందమైన లొకేషన్‌లో 'ది రాజా సాబ్' సినిమా పోస్టర్‌తో డిజైన్ చేసిన డ్రెస్‌ను ధరించి ఆమె కనిపించారు. "లైట్స్, కెమెరా, గ్రీస్!" అనే క్యాప్షన్‌తో ఈ ఫోటోను పంచుకున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఒక రోజు ముందే దర్శకుడు మారుతి కూడా ఇదే తరహాలో సినిమా పోస్టర్ ఉన్న టీ-షర్ట్ ధరించి ఉన్న ఫోటోను షేర్ చేశారు. ఇప్పుడు హీరోయిన్ కూడా అదే తరహాలో ప్రమోషన్ చేయడంతో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తయిందని, డబ్బింగ్ పనులు కూడా ప్రారంభమయ్యాయని సమాచారం. పాటల చిత్రీకరణ పూర్తయితే సినిమా మొత్తం పూర్తయినట్లే. ఇటీవల దర్శకుడు మారుతి, పాటల్లో ప్రభాస్ ఎనర్జీని చూసి తాను ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. 'బాహుబలి' సినిమాలో కట్టప్ప, బాహుబలి పాదాన్ని తన తలపై పెట్టుకునే ఐకానిక్ సీన్‌ను పోస్ట్ చేస్తూ, "నా డార్లింగ్ ప్రభాస్ ఎనర్జీ చూస్తుంటే ఇది గుర్తొచ్చింది" అని తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. ప్రభాస్ కెరీర్‌లో పూర్తిస్థాయి హారర్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. తొలుత ఈ ఏడాది డిసెంబర్ 5న విడుదల చేయాలని భావించినా, తాజాగా కొత్త విడుదల తేదీని ప్రకటించారు. ఈ చిత్రాన్ని 2026 జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సినిమాలో నిధి అగర్వాల్ మరో హీరోయిన్‌గా నటిస్తుండగా, కార్తీక్ పళని సినిమాటోగ్రఫీ, తమన్ సంగీతం అందిస్తున్నారు

## 'మీసాల పిల్ల' పాట వచ్చేసింది... ఎంజాయ్ చేయండి: చిరంజీవి




మెగాస్టార్ చిరంజీవి తన కొత్త చిత్రం నుంచి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్‌తో అభిమానుల ముందుకు వచ్చారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'మన శంకర వర ప్రసాద్ గారు' సినిమాలోని 'మీసాల పిల్ల' అనే పాట లిరికల్ వీడియోను పంచుకున్నారు. ఆ పాట వివరాలను స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించాఉ. ఈ పాటను దిగ్గజ గాయకుడు ఉదిత్ నారాయణ్ ఆలపించడం విశేషం. ఈ విషయాన్ని ప్రకటిస్తూ చిరంజీవి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ మెలోడీకి భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ఉదిత్ నారాయణ్‌తో పాటు శ్వేతా మోహన్ కూడా ఈ గీతాన్ని ఆలపించారు. గతంలో చిరంజీవి చిత్రాలలోని ఎన్నో సూపర్ హిట్ గీతాలకు ఉదిత్ నారాయణ్ తన గాత్రాన్ని అందించారు. చాలా కాలం తర్వాత మళ్లీ ఈ కాంబినేషన్‌లో పాట రానుండటంతో అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాలో చిరంజీవి సరసన నయనతార, కేథరిన్ ట్రెసా కథానాయికలుగా నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ అప్‌డేట్‌తో సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి నెలకొంది.

## కబడ్డీ కోర్టులో విక్రమ్ తనయుడు.. ఆసక్తి రేపుతున్న 'బైసన్' ట్రైలర్




తమిళ స్టార్ హీరో చియాన్ విక్రమ్ తనయుడు ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా, సంచలన దర్శకుడు మారి సెల్వరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బైసన్'. 'కర్ణన్', 'మామన్నన్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మారి సెల్వరాజ్ నుంచి వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 17న తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది. తాజాగా విడుదలైన ట్రైలర్ చూస్తే, ఈ సినిమా కబడ్డీ క్రీడా నేపథ్యంలో సాగే ఒక పవర్‌ఫుల్ డ్రామా అని స్పష్టమవుతోంది. 1980ల నాటి తమిళ గ్రామీణ వాతావరణంలో ఈ కథను చూపించనున్నారు. ఒక కబడ్డీ ఆటగాడి జీవితంలోని సంఘర్షణ, సమాజంలో అణగారిన వర్గాలు ఎదుర్కొనే వివక్ష, దానిపై వారు చేసే తిరుగుబాటు వంటి అంశాలను మారి సెల్వరాజ్ తనదైన వాస్తవిక శైలిలో కళ్లకు కట్టనున్నట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ధ్రువ్ విక్రమ్ ఈ చిత్రంలో ఓ పల్లెటూరి కబడ్డీ ఆటగాడిగా శక్తిమంతమైన పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ సినిమాలో ధ్రువ్ విక్రమ్ సరసన అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. లాల్, పశుపతి, రజిషా విజయన్, అమీర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. కబడ్డీ ఆటతో పాటు సామాజిక అంశాలను జోడించి మారి సెల్వరాజ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి.

## 'కె ర్యాంప్' తో కామ్నా జెత్మలానీ సెకండ్ ఇన్నింగ్స్



ఒకప్పుడు తెలుగు తెరపై తన గ్లామర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ముంబై భామ కామ్నా జెత్మలానీ సుమారు 12 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టాలీవుడ్‌లోకి పునరాగమనం చేస్తున్నారు. యువ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం 'కె ర్యాంప్' ద్వారా ఆమె తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించబోతున్నారు. జెనీలియా, భూమిక, లయ వంటి సీనియర్ హీరోయిన్లు తిరిగి సినిమాల్లోకి వస్తున్న ట్రెండ్‌లో ఇప్పుడు కామ్నా కూడా చేరారు. ఈ వార్త ఆమె అభిమానులకు, సినీ ప్రియులకు ఆసక్తిని కలిగిస్తోంది. 2005లో 'ప్రేమికులు' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమైన కామ్నా జెత్మలానీ, గోపీచంద్‌తో కలిసి నటించిన 'రణం' చిత్రంతో ఒక్కసారిగా స్టార్‌డమ్ సంపాదించుకున్నారు. ఆ సినిమా విజయం తర్వాత ఆమెకు యువతలో మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ తర్వాత 'కింగ్', 'సైనికుడు' వంటి కొన్ని చిత్రాల్లో కనిపించినప్పటికీ, ఆమె కెరీర్ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. చివరగా 2013లో విడుదలైన 'శ్రీ జగద్గురు ఆదిశంకర' చిత్రంలో ఆమె వెండితెరపై కనిపించారు. అప్పటి నుంచి సినిమాలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. తన కెరీర్ నెమ్మదించిన సమయంలో, కామ్నా జెత్మలానీ తన వ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టారు. 2014 ఆగస్టు 11న బెంగళూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సూరజ్ నాగ్‌పాల్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. పెళ్లి తర్వాత సినిమా అవకాశాలు తగ్గుతాయనే ఉద్దేశంతో ఆమె తన వివాహ విషయాన్ని కొంతకాలం గోప్యంగా ఉంచినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. వివాహం తర్వాత పూర్తిగా నటనకు దూరమైన ఆమె, ఇన్నేళ్ల తర్వాత మళ్లీ 'కె ర్యాంప్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె పాత్ర ఎలా ఉండబోతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.
జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న 'కె ర్యాంప్' చిత్రాన్ని రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కిరణ్ అబ్బవరం సరసన యుక్తి తరేజ హీరోయిన్‌గా నటిస్తుండగా, చైతన్ భరద్వాజ్ సంగీతం సమకూరుస్తున్నారు. చిత్ర బృందం ఈ సినిమాను దీపావళి పండుగ కానుకగా అక్టోబర్ 18న థియేటర్లలో విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

## సెల్ఫీ ఫోజులతో పిచ్చెక్కిస్తున్న ఖుషీ



సోషల్ మీడియా వాడకం బాగా పెరిగిపోయిన తర్వాత హీరోయిన్లు, సెలబ్రిటీల వారసులు ఒకరి తర్వాత ఒకరు ఫోటోలు షేర్ చేస్తూ పాపులారిటీ అవుతున్నారు. అటు సినిమాల ద్వారా ఇటు పలు ప్రకటనల ద్వారా తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలి అంటే ఇప్పుడు సోషల్ మీడియా అతిపెద్ద వేదికగా అవతరించింది. అందుకే సమయం, సందర్భం లేకపోయినా తమ గ్లామర్ ను వలకబోస్తూ.. ఫోటోలు షేర్ చేస్తూ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మరో స్టార్ కిడ్ కూడా తన అందాలతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. ఆమె ఎవరో కాదు అందాల తార దివంగత నటీమణి శ్రీదేవి చిన్న కూతురు ఖుషీ కపూర్. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో దర్శనం ఇచ్చే ఈ చిన్నది తాజాగా సెల్ఫీ ఫోజులతో అభిమానులను ఆకట్టుకుంది. ముత్యాలతో డిజైన్ చేసిన లైట్ పింక్ నెట్టెడ్ శారీ ధరించిన ఈమె అందాలు చూపిస్తూ అభిమానులను ఆకట్టుకుంది. తాజాగా ఖుషీ కపూర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. %ాశ్రీంశీ =ఝఱ% - మీసాల పిల్లతో అదరగొట్టిన మెగాస్టార్ ఇకపోతే ఖుషీ కపూర్ షేర్ చేసిన ఈ ఫోటోలకు ఈమె సోదరీ ప్రముఖ స్టార్ హీరోయిన్ జాన్వీ కపూర్ లైక్ చేసింది.

## అప్పట్లో నిహారిక, విష్వక్ సేన్.. హల్‌చల్ చేస్తున్న వీడియో..



మెగా డాటర్, నిర్మాత నిహారిక కొణిదెల, యువ హీరో విష్వక్ సేన్‌కు సంబంధించిన ఓ పాత వీడియో ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఎప్పటిదో తెలియని ఈ వీడియోలో వీరిద్దరూ చాలా సరదాగా, సిగ్గుపడుతూ కనిపించడంతో నెటిజన్ల మధ్య ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఈ వీడియోలో ఒక గోడ పక్కన నిల్చున్న నిహారిక, విష్వక్ ఒకరినొకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకుంటున్నారు. నిహారిక సరదాగా విష్వక్‌కు గిలిగింతలు పెట్టడం, దానికి అతను సిగ్గుతో నవ్వడం వంటి దృశ్యాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఈ వీడియో చూసిన నెటిజన్లు, "ఇది ఏ సినిమాలోనిది?", "వీరిద్దరూ ఎప్పుడు కలిశారు?" అంటూ రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. ఇది వారిద్దరూ కాలేజీ రోజుల్లో కలిసి నటించిన ఏదైనా షార్ట్ ఫిల్మ్ అయి ఉండవచ్చని చాలామంది అభిప్రాయపడుతున్నారు. యాంకర్‌గా కెరీర్ ప్రారంభించిన నిహారిక, 'ఒక మనసు' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినా నటిగా ఆశించిన విజయం దక్కలేదు. దీంతో ఆమె నిర్మాతగా మారి తన అభిరుచిని చాటుకున్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై ఆమె నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఘన విజయం సాధించడంతో నిర్మాతగా ఆమె పేరు ఇండస్ట్రీలో మార్మోగిపోయింది. ప్రస్తుతం నటనకు కాస్త విరామం ఇచ్చి, నిర్మాతగా కొత్త ప్రాజెక్టులపైనే పూర్తి దృష్టి సారిస్తున్నారు.


Published by Goli Sammi reddy , Owned by VIJETHA PUBLICATIONS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209, Printed at VIJETHA GRAPHICS & OFFSET PRINTERS, H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 and Published at H.No. 19-6-113/1, Laxminagar, Godavarikhani, Karimnagar-505 209 Editor: Pittala Ravinder, Associate Editor NAYANI RAJESH, RNI.No.APTEL/1998/02685, email: charcha123@gmail.com